మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



# కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించిన రాష్ట్ర అదనపు ఎన్నికల కమిషనర్ లోకేష్ కుమార్

-స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ హాల్,సిసి కెమెరాలతో అనుక్షణం పర్యవేక్షణ

-కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ నిషేదాజ్ఞలు

-స్ట్రాంగ్ రూం లాక్‌బుక్‌ల తనిఖీ



కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర అదనపు ఎన్నికల కమిషనర్ లోకేష్ కుమార్

**పటాన్‌చెరు,మే17,ప్రభాతవార్త:** జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు కేంద్రం గీతం యూనివర్సిటిలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూం ఓట్ల లెక్కింపుకేంద్రాన్ని రాష్ట్ర ఎన్నికల అదనపు కమీషనర్ లోకేష్ కుమార్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, జిల్లా ఎస్పీ రూపేష్ కుమార్‌లతోకలిసి సందర్శించారు. స్ట్రాంగ్ రూంలలో కట్టుదిట్టమైన భద్రత నడుమ ఎలక్ట్రానిక్ ఎటింగ్ యంత్రాల (ఈవీఎం)ను ఓట్ల లెక్కింపు కేంద్రమైన రుద్రారం గీతం యూనివర్సిటీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలలో భద్రపర్చిన ఈవీఎంలు, సెక్యూరిటీ లాక్‌బుక్ రిజిస్టర్స్‌లను, మూడు అంచెల సెక్యూరిటి లాక్‌బుక్ రిజిస్టర్స్‌ను, మూడు అంచెల సెక్యూటిరిటి ఏర్పాట్లను రాష్ట్ర ఎన్నికల అదనపు ఎన్నికల అధికారి లోకేష్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా లోటుపాట్లకు తావు లేకుండా కౌంటింగ్ కేంద్రం వద్ద పకడ్బంధి సెక్యూరిటీ చర్యలు, జిల్లా యంత్రాంగం చేపట్టినట్లు తెలిపారు. ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూంల వద్ద సాయుధ బలగాలతో పహారా ఏర్పాటు, ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా స్ట్రాంగ్ రూంలతో పాటు వాటి పరిసరాలను అనుక్షణం పరిశీలించేందుకు వీలుగా సీసీ కెమెరాలను అమర్చి, మానిటర్ల ద్వారా నిరంతం పర్యవేక్షణ జరిపిస్తున్నట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ నిషేదాజ్ఞలు అమలులో ఉన్నట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి ఇతరులేవరూ లోనికి వెళ్లకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. గీతం యునివర్సిటిలో ఏర్పాటు చేస్తున్న ప్రతి కౌంటింగ్ హాల్, స్ట్రాంగ్ రూం, సీల్‌లను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, అధికారులకు సూచనలు చేశారు. జూన్4న చేపట్టనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి అవాంతరాలు ఏర్పడకుండా అన్ని జాగ్రత్తలు తిసుకోవాలని అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు విధులు నిర్వర్తించే అధికారులు,సిబ్బంది రాకపోకలకు, అభ్యర్థులు,ఏజెంట్ల రాకపోకల కోసం వేర్వేరు మార్గాలలో భారికెడ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యుత్ సరఫరా, కౌంటింగ్ టెబుల్స్, ఇతర అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. అనంతరం కలెక్టర్ వల్లూరు క్రాంతి మాట్లాడుతూ ఈవీఎంలు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలకు అదనంగా ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేసినట్లు కౌంటింగ్ కేంద్రంలో జనరెటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షణ ఐఏఎస్ మనోజ్, కామారెడ్డి శిక్షణ ఐపిఎస్ కాజల్ సింగ్, నిమ్స ప్రత్యేక అధికారి రవీందర్‌రెడ్డి, ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కలెక్టర్ చేతుల మీదుగా దోస్త్ అడ్మిషన్ పోస్టర్లు విడుదల



డిగ్రీ కళాశాల అడ్మిషన్ పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్

**చేర్యాల,మే17, ప్రభాతవార్త**

చేర్యాల ప్రభుత్వ డిగ్రి కళాశాల 2024 దోస్త్ ఆడ్మిషన్ పోస్టర్లను శుక్రవారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి చేతుల మీదుగా కలెక్టర్ కార్యాలయంలో విడుదల చేశారు. కార్యక్రమంలో ఐడి కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ప్రసాద్,చేర్యాల ప్రభుత్వ డిగ్రి కళాశాల ప్రిన్సిపల్ కె.ప్రణీత, రసాయన శాస్త్ర అధ్యాపకులు వి.మనోహర్,జూనియర్ అసిస్టెంట్ దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

# చెరువును తలపించిన అక్కల బస్తీ...

-కోటి రూపాయలతో మురికి కాలువ నిర్మాణం

-మాస్టర్‌ప్లాన్‌కు తిలోదకాలు....?

-లెవెలింగ్ సక్రమంగా లేక మురికినీరు నేరుగా ఇండ్లలోకి....

-కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యమే కారణమా...?



చెరువును తలపిస్తున్న అక్కల బస్తీ



వర్షపు నీరు నేరుగా ఇండ్లలోకి వెళ్తున్న దృశ్యం

**రామాయంపేట, మే 17, ప్రభాతవార్త ః**

చిన్నపాటి వర్షానికి మురికి కాలువల నీరు ఇండ్లలోకి చేరుతుంది. సాధారణంగా మురికి కాలువల ద్వారా వెళ్లే నీరు ఏదో చెరువుల్లోనో, కుంటల్లోనో కలవడం మనం చూస్తుంటాం. మురికి కాలువల నిరన ఆమణం కూడా అదే ఉద్దేశంతో నిర్మించడం జరుగుతుంది. అయితే రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో సుమారు కోటి రూపాయలతో నిర్మించిన మురికి కాలువ అందుకు భిన్నంగా తయారవడంతో ప్రజలు వర్షం పడితే చాలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళ్తే...రామాయంపేట-సిద్దిపేట రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని సిద్దిపేట చౌరస్తా స్వామి వివేకానంద విగ్రహం నుండి సీతయ్య గుడి వరకు సుమారు కోటి రూపాయల ఖర్చుతో పెద్ద మురికి కాలువను (మోరి) నిర్మించడం జరిగింది. అయితే మాస్టర్ ప్లాన్ ప్రకారం మురికి కాలువ నిర్మాణం పనులు సక్రమంగా జరగకపోవడంతో అక్కల బస్తీలో ప్రజానీకం ఇబ్బందుల పాలవుతున్నారు. మురికి కాలువ నిర్మాణం కరెక్ట లెవలింగు లేకపోవడం వల్ల వర్షం పడిందంటే చాలు ప్రజల బాధలు వర్ణనాతీతం. మురికి నీరంతా రివర్స్‌గా వెళ్లి, అక్కల బస్తీలో ఉన్న ఇండ్లలోకి వెళ్తుంది. చిన్నపాటి వర్షానికి కూడా అక్కలబస్తీ జలమయమవుతుంది. గురువారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి అక్కలబస్తీలోకి వర్షంనీరు చేరుకొని చెరువును తలపించింది. ఇండ్లలోకి మురికినీరు ప్రవాహముల రావడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారు. తమ ఇబ్బందులు ఎవరూ పట్టించుకోవడంలేదని అక్కలబస్తీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎండాకాలంలోనే ఈ పరిస్థితి ఉంటే, వర్షాకాలంలో పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని ప్రజలు భయపడుతున్నారు. మురికి కాలువ నిర్మాణం సక్రమంగా లేకపోవడం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయనీ, మళ్లీ మోరి నిర్మాణం నూతనంగా చేపట్టాలని కౌన్సిలర్ చిలుక గంగాధర్ తెలిపారు. గ్రామంలోని నీరు మోరీ ద్వారా బయటకు వెళ్లవలసి ఉండగా, ఇండ్లలోకి రావడంతో విషపురుగులు రావడమే గాక, దుర్వాసన భరించలేకపోతున్నామని మహిళలు తెలిపారు. ఓట్లు వేయమని వస్తున్నారు. సమస్యలు పట్టించుకోవడం లేదంటూ అక్కలబస్తీ మహిళలు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి దాపురించింది అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు చేపట్టి, మురికి కాలువల నీరు ఇండ్లలోకి రాకుండా యుద్ధ ప్రాతిపదిక మీద తగిన చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సత్వరం స్పందిచాలని వారు డిమాండ్ చేశారు.

# ఓటు వేయడంలో ప్రభుత్వ ఉద్యోగుల నిర్లక్ష్యం

-ప్రతి ఒక్కరు ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలి

-ఓటు వేయని ఉద్యోగుల పై వేటు వేయాలి



ఓటు హక్కు వినియోగించుకుంటున్న సింబల్

**కొండపాక, మే 17, ప్రభాతవార్త**

భారత రాజ్యంగం కల్పించిన ఓటు హక్కు ఎంతో విలువైనది, అది వజ్రయుదం లాంటిదని ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరు తప్పని సరిగా వినియోగించుకోవాలని ఎంతో మంది మేధావులు, విధ్యవంతులు సూచిస్తున్నారు. కాని తమ ఓటు హక్కును వినియోగించుకొవడంలో కొంత మంది ప్రభుత్వ ఉద్యోగులు, చదువుకున్న యువత నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఓటు హక్కును వినియోగించుకొని వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకొవాల్సి అవపరం ఎంతైన ఉంది. ఉద్యోగులకు, చదువుకున్న యువతకు ఓటు హక్కు వినియోగంపై స్పష్టమైన అవగహన ఉన్నప్పటికి స్థానిక సంస్థలు, అసెంబ్లీ, పార్లమెంట్, మున్సిపల్, కార్పోరేషన్ తదితర ఎన్నికల్లో కూడా తమ ఓటు హక్కును వినియోగించుకొకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల విధి నిర్వహణకు వెళ్ళిన ఉద్యోగులు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో ముందుగానే తమ ఓటు హక్కును వినియోగించుకొంటుండగా కొంత మంది మాత్రం ఓటు వేయకుండా రాజ్యంగం కల్పించిన ఓటు హక్కును చిన్న చూపు చూస్తున్నారనే వాదనలు ఘటుగా వినిపిస్తున్నాయి. దేశ ప్రజలకు సుపరిపాలన అందించడంలో, దేశ అభివృద్దిలో అందరికి సమాన హక్కు ఉండాలనే ఉద్దేశ్యంతో 18 సంవత్సరాలు నిండిన ప్రతి భారత దేశ పౌరుడికి ఓటు హక్కును డా॥ బి.అర్ అంబేడ్కర్ రాజ్యంగం ద్వారా కల్పించారు. దేశానికి దశ, దిశను చూపె ఎన్నికల్లో కూడా కొంత మంది తమ ఓటు హక్కును వినియోగంచుకొవడంలేదు. ఎన్నికల రోజు ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రభుత్వం ప్రకటించినప్పటికి ఓటు వేయడానికి ఎన్నికల డ్యూటీలు లేని ప్రభుత్వ ఉద్యోగులు కొంత మంది అంతగా అసక్తి చూపడం లేదు. ఎన్నికల రోజు కొంత మంది ప్రభుత్వ ఉద్యోగులు సెలవు రోజు ఓటు వేయకుండా స్వంత పనుల నిర్వహణ కోసం చిట్టిలు, రియల్ ఎస్టేట్ వ్యాపారం, వినోద, విహర యాత్రలకు, విందులు, వినోదలకు, సెటిల్‌మెంట్లు ఇతర పనుల కోసం ప్రభుత్వం ఇచ్చిన వేతనంతో కూడిన సెలవు దినాన్ని ఓటు హక్కును వినియోగించుకోకుండా సెలవు రోజును దుర్వినియోగం చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులై ఉండి కూడా తమ ఓటు హక్కును వినియోగించుకోని ప్రభుత్వ ఉద్యోగులపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాం, ఎలక్షన్ కమిషన్ కఠిన చర్యలు తీసుకొని ప్రతి ఉద్యోగి తప్పని సరిగా తమ ఓటు హక్కును వినియోగించుకొ నేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత వారిపై ఉంది. చదువుకున్న యువత సైతం జల్సాలు చేస్తు సెల్ ఫోన్ మోజులో పడి ఓటు హక్కును వినియోగించు కోకుండా బాధ్యత రహితంగా వ్యవహరిస్తున్నారు. ఓటు వేసై నా కేమోస్తుంది, నేను ఒక్కడిని వేయకుంటే ఎంది అనే నానా రకాల బాధ్యత రహితమైన కారణా లు చూపుతు ఓటు హక్కు వినియోగంలో నిర్లక్ష్య దోరణితో పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవడం లేదు. యువత చేతిలోనే దేశ భవిష్య త్, దశ, దిశ అధారపడి ఉందని తెలిసి కుడా వారు ఓటు హక్కును వినియోగించుకొవడంలేదు. నిరక్ష్యరాస్యులు, రోజువారి కూలీ పనులు చేసుకొనే ఓటర్లు మాత్రం ఉదయం నుండి సాయంత్రం వరకు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి క్యూలో నిలబడి తప్పకుండా తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు తప్పకుండా ప్రతి ఎన్నికల్లో ఓటు వేసేలా అవగహన కల్పించి తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోనేల చూడాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. ఓటు హక్కును వినియోగించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, యువతపై కఠిన నిర్ణయాలు తీసుకొని ప్రతి ఎన్నిక ల్లో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును తప్పని సరిగా విని యోగించుకోనేలా చూడాల్సి ఉంది.

# తహసీల్దార్ వాఖ్యలతో రెచ్చిపోయిన రైతులు

-ఆగిపోయిన వాహనాలు-క్షమాపణలు చెప్పిన తహసీల్దార్



తహసీల్దార్ వాఖ్యలతో ఆందోళనకు దిగిన రైతులు

**పాపన్నపేట, మే 17, ప్రభాతవార్త:** నిలిచిపోయిన వరి ధాన్యం రవాణాను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ రైతులు రాస్తారోకో చేస్తుండగా అక్కడికి చేరుకున్న తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు రైతులపై ఒకింత అసహనం వ్యక్తం చేయడంతో రైతులు రెచ్చిపోయి ఆందోళనకు దిగిన సంఘటన మండలంలోని మిన్పూర్ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే... మిన్పూర్ వద్ద మెదక్-బొడ్మట్‌పల్లి రోడ్డుపై రైతులు వరి ధాన్యం రవాణాను ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ రాస్తా రోకో చేస్తున్న విషయం తెలుసుకున్న తహసీల్దార్ సంఘటన స్థలానికి చేరుకుని ఎప్పుడూ మీ గోలేనా... మాకు పెళ్లాం పిల్లలు లేరా, మాకు కాలక్షేపం అవసరం లేదా, ఎప్పుడే మీ ఆందోళనల వద్దకు రావడానికే సరిపోతుందంటూ తహసీల్దార్ రైతులపై అసహనం వ్యక్తం చేయడంతో పుండు మీద కారం చల్లిన చందంగా అప్పటికే అసహనంతో ఉన్న రైతులు తహసీల్దార్ వాఖ్యలతో ఆందోళనకు, ఆగ్రహానికి గురయ్యారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మిన్పూర్ వద్ద గత వారం రోజులుగా రవాణ జరగక వందలాది క్వింటాళ్ల ధాన్యం సంచులు కల్లాల్లో పేరుకుపోయాయని, గురువారం రాత్రి కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసి మొలకలు వచ్చాయన్నారు. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకుపోయిన ప్రయోజనం లేకపోడంతో రాస్తారోకోకు పూనుకోవాల్సి వచ్చిందన్నారు. స్థానికంగా ఉండకుండా రైతలు సమస్యలు పట్టించుకోని తహసీల్దార్‌ను వెంటనే సస్పెడ్ చేయాలని, తమపై నోరు జారిన తహసీల్దార్ క్షమాపణలు చెప్పాలని రైతులు డిమాండ్ చేశారు. ఎఎస్‌ఐ సంగన్న తన బలగంతో సంఘటన స్థలంలోని రైతులకు నచ్చచెప్పినా ప్రయోజనం లేకుండా పోయింది. రైతులు రాస్తారోకోతో కిలో మీటరు మేర వాహనాలు ఎక్కడివి అక్కడే నిలిచిపోవడంతో డిగ్రీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులు, ఆసుపత్రులకు వెళ్లే రోగులు తీవ్ర ఆందోలనకు గురయ్యారు. ఎస్‌ఐ సురేష్ సంఘటన స్థలానికి చేరుకుని రైతుల సమస్యలు తీరికగా విని తహసీల్దార్‌కు సంఘటన స్థలానికి పిలిపించుకుని రైతులకు తహసీల్దార్ క్షమాపణలు చెప్పడంతో పాటు గంట వ్యవధిలో ధాన్యం రవాణా ప్రారంభిస్తామని హామి చేయడంతో రైతులు శాంతించారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు కుబేరుడు, మాజీ ఎంపిటిసి సభ్యులు బస్వ గోపాల్, మాజీ సర్పంచ్ లింగరెడ్డి, బాబర్‌తో పాటు వందలాది మంది రైతులు పాల్గొన్నారు.

# రక్తసిక్తమతున్న జాతీయ రహదారి పనులు...!

-కాంట్రాక్లర్ నిర్లక్ష్యం వల్ల ప్రాణాలు కోల్పోయిన 14 మంది అమాయక ప్రయాణికులు

-నాసి రకంగా రోడ్లకు ఇరువైపులా నిర్మించిన మురుగు కాలువలు

-వంతెనల వద్ద తారు రోడ్డు వేయని గుత్తేదారులు

-తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రజలు



ఇప్పుడిప్పుడే మొదలవుతున్న పందిల్ల బ్రిడ్జి పనుల దృశ్యం



వర్షానికి రోడ్డుపై నిలిచిన నీటితో ఇబ్బందులు పడుతున్న వాహనదారుల

**హుస్నాబాద్,మే17,ప్రభాతవార్త :** గత రెండేళ్ళ క్రితం చేపట్టిన హుస్నాబాద్ మీదుగా రామాయంపేట నుండి ఎల్కతుర్తి వరకు జాతీయరహదారిపనులు గుత్తేదారి పుణ్యమాని రక్తమోడుతున్నాయి.ఇదంతా కేవలం గుత్తేదారి నాణ్యత లోపించిన రహదారి పనుల వల్లనేనని ఇక్కడి ప్రజానీకం గగ్గోలు పెడుతోంది.గత రెండేళ్ళ క్రితం చేపట్టిన ఈ పనులు నిర్త్యంగా పనులు చేపట్టడం మూలానా సంభవిస్తోందని పలువురు ఆరోపిస్తున్నా కాంట్రాక్టర్ తన ఇష్టారాజ్యంగా పనులు చేసునతన్న విషయంపై ప్రజల నుండి తీవ్ర ఆగ్రహాదేశాలు వ్యక్తమవుతున్నా యి.ఇదిలా ఉండగా రక్తమోడుతున్న ఈ రహదారి పనుల్లో బలిపశువులుగా మారిన కుటుంబాలను ఎవరు ఆదుకుంటారని ప్రజానీకం నుండి ప్రశ్నలు ఎదురవుతున్నాయి.

**-కాంట్రాక్లర్ నిర్లక్ష్యం వల్ల ప్రాణాలు కోల్పోతున్న అమాయక ప్రయాణికులు**

హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఎల్కతుర్తి నుండి సిద్దిపేట జిల్లా రాజగోపాల్‌పేట వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి నెంబర్ 765 డిజి పనులు నత్తనడకగా సాగుతున్నారు.2022 సెప్టెంబరు నెలలో ఎజి కన్‌ష్టక్షన్స్ వారు ఈ దారిని నిర్మించేందుకు 66కిలోమీటర్లకు రూ 350కోట్లతో టెండర్‌ను దక్కించుకుని అగ్రిమెంట్ చేసుకున్నారు.అనంతరం రెండు నెలలు ఆలస్యంగా పనులు ప్రారంభించినట్లు అధికారులు స్పష్టంగా చెబుతున్నారు.ఈ నేపధ్యంలో 2022 నవంబర్‌లో ప్రారంభమైన పనులు దాదాపు రెండు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా సగం వరకైనా పూర్తి కాకపోవడంపై వాహణ దారులతో పాటు ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు. అసంపూర్తిగా చేస్తున్న ఈ రహదారి పనులతో వాహణదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ రహదారిలో మొత్తం 124 కల్వర్టులు ఉండడంతో గుత్తేదారులు వాటిని తొలగించి పూర్తి చేసే తరుణంలో వాహణాలు పక్కనుండి వెళ్లేందుకు ఎలాంటి తారు రోడ్లు వేయకపోవడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు మట్టిరోడ్లు బురదమయం అవుతుండడంతో అనేక వాహణదారులకు తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.పనులు మొదలు పెట్టిన నుండి ఇప్పటి వరకు ప్రమాదంలో భీమదేవరపల్లి మండల పరిధిలో మూడు రోడ్డు ప్రమాదాలు అందులో ఒక్కరు మృతి చెందగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. హుస్నాబాద్ మండల పరిధిలో 15 రోడ్డు ప్రమాదాలు జరిగగా అందులో నలుగురు అక్కడిక్కడే మృతి చెందగా మరో 12 మంది తీవ్రగాయాలపాలయ్యారు.కోహెడ మండల పరిధిలో మూడు ప్రమాదాలు కాగా అందులో ఒకరు కల్వర్టు కోసం తీసిన గుంతలో పడి ఒక్కరు మృతి చెందగా చెంచర్‌చెరువుపల్లికి చెందిన మరో వ్యక్తి సైతం రోడ్డు ప్రమాదంలోనే మరణించారు.కోహెడ మండల పరిధిలో ఇద్దరు మరణించగా మరో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. రాజగోపాల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గత కొద్ది రోజుల క్రితమే రోడ్డు పక్కన తీసిన గుంతలోకి కారు దూసుకెళ్లి అందులో ఉన్న నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మరణించగా మరో ముగ్గురు సైతం రోడ్డు ప్రమాదంలో మరణించడంతో పాటు దాదాపు 60మంది రోడ్డు ప్రమాదాల వల్ల తీవ్ర గాయాలపాలయ్యారు.గుత్తెదారుల నిర్లక్ష్యం అధికారుల పాలకుల పట్టింపు లేకపోవడం వల్లే పనులు నత్తనడకగా సాగుతున్నాయని ప్రజలు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు.

**-నాసీ రకంగా మురుగు కాలువల నిర్మాణం**

జాతీయ రహదారికి రెండు వైపులా నీరు నిలవకుండా ఉండేందుకు నిర్మిస్తున్న డ్రైనేజీ(మురుగు)కాలువల నిర్మాణంలో కాంట్రాక్టర్ నాసీ రకంగా నిర్వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.పలు గ్రామాలలో రోడ్డుకంటే ముందుగానే పూర్తైన ఈ కాలువలు మూడు నెలలు గడువక ముందే పగుళ్లు పడుతున్నాయని వాపోతున్నారు.మురుగు కాలువలు పూర్తి చేసిన కాంట్రాక్టర్ దానికి క్యూరింగ్ చేయాల్సి ఉండగా ఒక్కసారి సైతం దీనికి నీళ్లు పట్టిన పాపాన పోలేరని బహిరంగంగా చెబుతున్నారు.ఇది ఇలాగే కొనసాగితే రోడ్డు పనులు పూర్తికాక ముందు మురుగు కాలువలు కూలిపోయో ప్రమాదం లేకపోలేదు.ఈ విషయంపై అధికారులు చొరవ తీసుకుని నిర్మించిన మురుగు కాలువలకు కొద్ది రోజులైన నీళ్లు పట్టించాల్సిన అవసరం ఉంది.

**-తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు**

నత్తనడకగా సాగుతున్న ఈ జాతీయ రహదారి పనులలో భాగంగా కాంట్రాక్టర్ రోడ్లను పూర్తిగా ధ్వంసం చేసి అందులో కాంక్రీట్ వేసి వొదిలేసి, కనీసం నీళ్లు పట్టకపోతుండడంతో రోడ్డుపై ప్రయాణం చేసే వాహణదారులు వచ్చే దుమ్ము కళ్లలో పడి రోడ్డు కనిపించడం లేదని,అంతే కాకుండా దుమ్ము ద్వార శ్వాస తీసుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని పూర్తి కాకున్నా కనీసం దుమ్ము లేవకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను వాహణదారులు వేడుకుంటున్నారు.

**-పందిల్ల బ్రిడ్జి పూర్తి కాకుంటే హుస్నాబాద్‌కు రహదారి బందేనా...!?**

66 కిలోమీటర్ల జాతీయ రహదారిలో ఉన్న 124కల్వర్టులలో ఇప్పటికి 64 కల్వర్టులు పూర్తయ్యాయి.అయితే అన్ని బ్రిడ్జిలలో కాస్త పెద్దదైన పందిల్ల వంతెన పనులను కాంట్రాక్టర్ ఇప్పుడిప్పుడే ప్రారంభిస్తున్నారు.అయితే ఈ పనులు పూర్తి చేసేందుకు మరో మూడు నెలలు పట్టే అవకాశం ఉందని అక్కడ పని చేస్తున్న వారు చెబుతున్నారు.అయితే ప్రతీ వర్షాకాలం హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు మత్తడి పడే సందర్భంలో పందిల్ల వాడు పొంగి పొర్లుతుంటుంది.ఆ సమయంలో హుస్నాబాద్ నుండి సిద్దిపేటకు రాకపోకలు నిలిచిపోతాయి.అయితే వర్షాకాలం రాకమునుపే ఈ బ్రిడ్జి పూర్తి కాకుంటే ఇక సిద్దిపేట,హైదరాబాద్ లాంటి ప్రదేశాల నుండి హుస్నాబాద్‌కు రాకపోకలు నిలిచిపోవడం తప్పదని పలువులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా గుత్తెదారులు పనుల్లో వేగం పెంచి త్వరగా పనులు పూర్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.అయితే రాష్ట్ర రాజధానిలో గత కొద్దినాళ్ళ క్రితం దుర్గం చెరువుపై కేబుల్‌బ్రిడ్జి పనుల సందర్భంగా ప్రముఖ సినీహీరో సాయిధరమ్‌తేజ్ గాయపడిన సందర్భంగా అతను వేసిననష్టపరిహారం వ్యాజ్యంతో హైకోర్టు పరహారం ఇవ్వాలని కోర్టు తీర్పును వెలువరించిన విషయం తెలిసిందే.

# పల్లెల అభివృద్ధికే ప్రత్యేక అధికారులు

-ఎంపిపి అధ్యక్షురాలు చందనరెడ్డి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి చందనరెడ్డి

**పాపన్నపేట, మే 17, ప్రభాతవార్త:** ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధికి త్రేక అధికారులు తమ వంతు కృషి చేయాలని ఎంపిపి అధ్యక్షురాలు చందనరెడ్డి సూచించారు. శుక్రవారం మండల సర్వసభ్య సమావేశంలో ఎంపిపి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు పెరిగి గాలి వీచినప్పుడు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. ఉపాధి హామిలో పని చేసిన కూలీలకు డబ్బులు సాకలంలో అందడం లేదని సమస్యను పరిష్కరించాలని సభ్యులు డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలులో జాప్యం జరుగుతోందని, రైతులు ఇబ్బందుల పడుతున్నారని, అధికారులు పట్టించుకోవడం లేదని సభ్యులు విచారం వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన పాపన్నపేటలో పలు వార్డులలో మిషన్ భగీరథ ఈరు సక్రమంగా సరఫరా కావడం లేదని ఎంపిటిసి సభ్యులు శ్రీనవాస్ సభ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎంపిపి చందనరెడ్డి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా మండలాభివృద్దికి కృషి చేశామని తెలిపారు. ఎంపిపిగా తనకు ఇది చివరి సమావేశం అని పదవీ కాలంలో తనకు సహకరించిన ప్రజాప్రతినిధులకు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డిఎల్‌పిఓ సతీష్‌కుమార్, ఎంపిడిఓ సుబ్రమణ్యం, ఎంపిపి ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు గౌస్, ఎంపిటిసి సభ్యులు రమేష్ గౌడ్, సరస్వతి, ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

## గిరిజన గురుకులంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు

**కంగ్టి, మే 17 ప్రభాతవార్త:** తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో కంగ్టి గురుకులంలో చదువుకునేందుకు ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కంగ్టి గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సి.హెచ్. శ్రీనివాస్ రాయ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాకు చెందిన విద్యార్థులు సీఈసీ, మరియు హెచ్‌ఈసీ గ్రూపులకు మిగిలిన సీట్లకు గాను 2024, 2025 సంవత్సరానికి పదవ తరగతి పాసైన గిరిజన విద్యార్థులు స్పాట్ అడ్మిషను కొరకు హాజరుకావాలని అన్నారు. ఈనెల 25వ తేదిన గిరిజన ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయం మానస హీల్స్, రాజేంద్రనగర్, రంగారెడ్డి జిల్లా నందు ఉదయం 10.30 లకు గిరిజన విద్యార్థులు తమ ఒర్జినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని ప్రిన్సిపాల్ కోరారు. ఒర్జినల్ సర్టిఫికెట్లతో పాటు జీరాక్స్ కాపీలతో స్పాట్ అడ్మిషన్‌కు హాజరుకావాలని అన్నారు. మిగతా వివరాలకు సెల్‌నెం. 7382 931496కు సంప్రదించాలని అన్నారు.

# వీర బ్రహ్మేంద్రస్వామిని దర్శించుకున్న మంత్రి దామోదర్



వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాల్లో పాల్గొన్న మంత్రి దామోదర్ రాజనర్సింహా

**అల్లాదుర్గం, మే 17, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన రేగోడ్‌లో కొలువున్న శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామిని శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ రాజనర్సింహా దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని స్వామి వారి మఠంలో 74వ వార్షిక ఆరాధన మహోత్సవాలు కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో భాగంగా మంత్రి దామోదర్ రాజనర్సింహా మఠానికి చేరుకోగా మఠం పూజారులు మంత్రిని పూర్ణకుంబంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మఠం అభివృద్ధికి సహకరించాలని మంత్రి దృష్టికి తేగా సానుకూలంగా స్పందించినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు.

## రోడ్డు దాటుతుండగా వ్యక్తిని ఢీకొన్న కారు

**కొల్చారం, మే17 ప్రభాతవార్త:** రోడ్డు దాటుతున్న వ్యక్తిని వేగంగా వస్తున్న కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలై కాలు తెగిపడిన సంఘటన మండల కేంద్రమైన కొల్చారంలోని పోలీస్ స్టేషన్ ముందు శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానిక ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ కథనం ప్రకారం కొల్చారం గ్రామానికి నిమ్మగల్ల దేవయ్య(55) పశువులను మేపుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. పశువులను మేపుతున్న క్రమంలో మెదక్-హైదరాబాద్ ప్రధాన రోడ్డు దాటుతుండగా ఏడుపాయల నుండి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో దేవయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఒక కాలు అక్కడే తెగిపడింది. హైదరాబాద్‌కు చెందిన మధుర రాజేష్ ఏడుపాయలకు దైవ దర్శనానికి వచ్చి తిరిగి హైదరాబాద్ వెళ్తున్న క్రమంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. దేవయ్యను ఢీకొట్టి ఆగకుండా అతివేగంగా అలాగే వెళ్లడంతో కొల్చారం ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ కారును వెంబడించి కౌడిపల్లి పోలీస్ స్టేషన్ సమీపంలో పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దేవయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేం`కు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహమ్మద్‌గౌస్ తెలిపారు. గయాలైన దేవయ్యను ఆటోలో మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వ ఆస్పత్రి నుండి డాక్టర్లు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు.

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు బండి యాదగిరి : ఎమ్మెల్సీ మధుసూదనాచారి

**చిక్కడపల్లి, మే 17 ప్రభాతవార్త:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు బండి యాదగిరి అని తెలంగాణ శాసనసభ తొలి స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండమధుసూదనాచారి అన్నారు. శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో కార్యక్రమంలో భాగంగా ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ కవి బండి యాదగిరి సంస్మరణ సభ శుక్రవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన జరగింది. ముఖ్యఅతిథిగా హాజరైన సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ 'బండెనక బండి కట్టి పదహారుబండ్లు కటి' పాటను రాసి దొరల గుండెల్లో గుబులు లేపాడని, ప్రజల హృదయాల్లో ఆ పాట చిరస్మరణీయంగా నిలిచి ఉందన్నారు. అప్పటి నుంచి బండి యాదగిరి పేరు చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. పాటలతో ప్రజానీకాన్ని ఉత్తేజితం చేసిన యాదగిరి గన్నుపట్టి పోరాటంలో పాల్గొన్న యోధుడని కొనియాడారు. బండి యాదగిరి వంటి త్యాగధనుల వల్లనే నేడు తెలంగాణ విముక్తి చెందిందన్నారు. ఆయనచరిత్ర నేటి యువతకు స్ఫూర్తినివ్వాలన్నారు. సాయుధ పోరాటంలో అద్భుతంగా పాత్రదారి బండి యాదగిరి అని అన్నారు. బండి యాదగిరి, సుద్దాల హనుమంతు వంటి కవులు, కళాకారులు తమ కలాలు, గళాల, కళారూపాల ద్వారా సాయుధపోరాటంలో మద్దతు కూడగట్టడంలో విజయం సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు, సాహితీవేత్త తంగిరాల చక్రవర్తి, ప్రముఖ గాయకుడు శ్రీధరం రామసుబ్రహ్మణ్యం, గాయనీ గరిమెళ్ళ సీత తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న తెలంగాణ శాసనసభ తొలి స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండమధుసూదనాచారి

## పదేళ్లలో ఉద్యమకారులకు ఎలాంటి న్యాయం జరగలేదు

**-తెలంగాణ ఉద్యమకారులు హక్కుల ఫోరం అధ్యక్షులు బోర్గి సంజీవ్**

**హైదరాబాద్,మే 17,ప్రభాతవార్త:** స్వరాష్ట్ర ఏర్పాటు కోసం సర్వస్వాన్ని కోల్పోయిన వారిని ఆదుకోవ డంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని వారి హక్కులను పరిరక్షిం చేందుకు తెలంగాణ ఉద్యమకారులు హక్కుల ఫోరాన్ని ఏర్పాటు చేసినట్లు ఫోరం అధ్యక్షుడు, ఉద్యమ సమయంలో పోలీస్ కోల్పో యిన బోర్గి సంజీవ్తెలిపారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మా ట్లాడారు. రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తికావస్తున్నా రాష్ట్ర ఏర్పాటు కోసం త్యాగాలు చేసిన వారికి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మబలిదానాలు ,నిస్వార్థంత ఉద్యమకారుల త్యాగాలతో రాష్ట్రం ఏర్పడితే ఫలితం కొంతమందికే పరిమితమైందని వాపో యారు. రాష్ట్రంలో పాలన మారితే ఉద్యమకారులకు మేలు జరుగు తుందని భావించినా ప్రయోజనం లేకుండా పోయిందని అన్నారు. ఈనేపథ్యంలో నూతన ఫోరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నిజమైన అమరవీరులను గుర్తించి ఒక్కో కుటుంబానికి కోటిరూపా యల ఎక్స్‌గ్రేషియా, తెలంగాణ ఉద్యమకారులకు 500గజాల ఇం టిస్థలం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. అలా గే అమరవీరుల కుటుంబసభ్యులకు ప్రజాప్రతినిధులుగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధనకై పోరాడు తూనే రైతాంగ, కార్మికుల పక్షాన నిలుస్తామని చెప్పారు.

## లంగర్‌హౌస్‌లో కారు బీభత్సం

**-పళ్ళ దుకాణంలోకి దూసుకెళ్ళిన వాహనం**

**హైదరాబాద్, మే17, ప్రభాతవార్త:** మితిమీరిన వేగంతో అదుపు తప్పిన కారు రోడ్డు పక్కనున్న ఫ్రూట్ స్టాల్‌లోకి దూసుకెళ్ళిన ఘటన లంగర్ హౌస్ ప్రాంతంలో చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఫ్రూట్ షాపులో ఉన్న వ్యాపారితో పాటూ పక్కనే ఉన్న బాలునికి తీవ్ర గాయాల య్యాయి. దాంతో అక్కడున్న స్థానికులుగా యాల పాలైన ఇద్దరినీ వెంటనే ఆసుపత్రికి తరలించి, కారు డ్రైవరుని పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, కారు డ్రైవర్ మద్యం సేవించి వాహనం నడిపాడా, లేక సాధారణ స్థితిలో నడిపాడా అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు.

# ఆహార కల్తీ..రోగాలతో కుస్తీ

**హైదరాబాద్, మే 17 ప్రభాతవార్త**

ఇటీవల ఇద్దరు మిత్రులు మేడిపల్లిలోని ఒక రెస్టారెంట్‌కు వెళ్లి చికెన్ కర్రీ, రొట్టెలు ఆర్డర్ చేశారు. కొద్దిపేసటి తర్వాత వెయిటర్ వాటిని తీసుకొచ్చాడు. అది తింటుంటే కుళ్లిన వాసన వచ్చింది. ఇందేంటని అడిగితే స్పందన లేదు. అధికారులకు ఫిర్యాదు చేద్దామంటే ఎవరికి చెప్పాలో అవగాహన బోర్డులు లేవు. తిని రోగాలు తెచ్చుకోవడం కంటే తినకుండా బిల్లు చెల్లించడం బెటర్ అని వచ్చేశారు. ఇది నగర శివారు ప్రాంతాల్లోనే కాదు..రాష్ట్ర రాజధాని గ్రేటర్ హైదరాబాద్‌లో పలు రెస్టారెంట్లలో ఇదే పరిస్థితి కనిపిస్తుంది.

నగరంలో ఆహార రంగం అతిపెద్దది. చిన్నవి పెద్దవి కలిసి సుమారు 25వేల వరకు ఉంటాయి. నగరంలో బిర్యానీ, మాంసాహారం ప్రపంచ వ్యాప్తంగా పేరు గాంచాయి. వేలాదిగా ఉన్న హోటళ్లలో రోజు లక్షలాది మంది భుజిస్తుంటారు. జిహెచ్ఎంసి పరిధిలోని 22 మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు వారంలో 5 రోజులపాటైనా హోటళ్లు, మిఠాయి షాపులు, బేకరీలను తనికీలు చేసి ఆహార నాణ్యత పరిశీలించాల్సి ఉంటుంది. కానీ వారు కార్యాలయాల నుంచి కదలడం లేదన్న ఫిర్యాదులున్నాయి. తనిఖీలు లేకపోవడంతో ఎవరూ పట్టించుకోవడం లేదు. గతంలో జరిగిన తనిఖీ సమయంలో కుళ్లిన ఆహార పదార్థాలు, లేబుల్ లేని తినుబండారాలు తయారు ప్రదేశాలను గుర్తించి తనిఖీచేపట్టారు. కుళ్లిన ఆహార పదార్థాలతోపాటు తయారు చేసే ప్రదేశం అధ్వాన్నంగా ఉండడం చూసి నివ్వెరపోయారు. మారుతున్న జీవన శైలిలో భాగంగా తినే ఆహారంలో అనేక మార్పులొచ్చాయి. భుజించే ఆహారంలో కల్తీ పెరుగుతుండడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

**అడ్డుకునే వారు లేదు..**

నగరంలో ఆహార కల్తీ ఆందోళన కలిగిస్తోంది. జిహెచ్ఎంసి ఆరోగ్య విభాగం మామూళ్ల మత్తులో మునిగిపోవడంతో చివరకు చిన్నారులు తాగే పాలు, తినే చాక్లెట్ల నుంచి ఆహార పదార్థాల వరకు కల్తీ అధికమైంది. చాలా హోటళ్లలో కుళ్లిన మాంసం, పాడైన వస్తువులతో వండి వారుస్తున్నారు. తనిఖీలు లేకపోవడంతో లక్షలాది మంది నాణ్యత లేని ఆహారాన్నే తినాల్సి వస్తోంది. బల్దియా పరిధిలో సుమారు 22 మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నా చాలా మంది ప్రధాన కార్యాలయాన్ని వదిలి క్షేత్రస్థాయికి రావడం లేదనే విమర్శలు ఉన్నాయి. చిన్న హోటల్ నుంచి మొదలుకొని రెస్టారెంట్ల వరకు ఆహారం కల్తీ జరుగుతుంది. వంటల్లో నాణ్యమైనా మంచి నూనె వాడడం లేదు. కొన్నిసార్లు వాడిన నూనెను పదేపదే వాడడంతో విష పదార్థాలు తయారవుతున్నాయి. తాజా కూరగాయలతో వంటలు చేయకపోవడం, బిర్యానీల్లో ఆకర్షించేలా రంగులను వాడుతున్నారు. నూడుల్స్ రుచిగా ఉండేలా కొన్ని పదార్థాలు కలుపుతుంటారు. ప్రతి ఆహార పదార్థాల్లో కల్తీ చేసి విక్రయిస్తుంటారు. జాగ్రత్తగా గమనించి కొనుగోలు చేయాలి. క్షేత్రస్థాయిలో నాసిరకం పదార్థాలు విక్రయిస్తున్నా పరిశీలించాల్సిన అధికారులు కానరావడం లేదు. నిబంధనల ప్రకారం ప్రతి వస్తువుపై లేబుల్ ఉంచాలి. తయారీ తేదీ, అందులో కలిపే వస్తువులు, గడువు వివరాలు ఉండాలి. మార్కెట్లలో పలు రకాల అప్పాలు, పచ్చళ్లు, చిప్స్, కారం, బందో, పాపుడాలు, అప్పడాలు, పచ్చళ్లు, చిన్న పిల్లలు తినే ప్యాకెట్లు అనుమతులు లేకుండానే తయారు చేస్తున్నారు. శివారు ప్రాంత జిల్లాల వారీగా ఆహార కల్తీ నిరోధక శాఖలను ఏర్పాట చేశారు. జిల్లాకు ఒక గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌తోపాటు ఫుడ్ సేఫ్టీ అధికారిని నియమించారు. అధికారులు ఆహార భద్రత, పరిరక్షణ, ప్రమాణాలను పర్యవేక్షించాలి. వీరికి సహాయకులుగా జూనియర్ అసిస్టెంట్, ఇద్దరు ఆఫీస్ సబార్డినేటర్లను నియమించారు. అయినా వీరి పర్యవేక్షణ, తనిఖీలు, కేసుల నమోదులు కనిపించడంలేదు.

**వ్యాధులకు మూలం...**

నాణ్యతను అసలు పట్టించుకోవడం లేదు. మాంసాహార వంటకాలకు రంగు తెప్పించేందుకు నిషేధిత టర్‌ట్రాజైన్ అనే సింథటిక్ రసాయనాన్ని కలుపుతున్నారు. అలాగే యూరియాతో పాలు తయారు చేస్తున్న వైనం వెలుగులోకి వచ్చాయి. అయినా నగర ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు దీన్ని పరిగణనలోకి తీసుకోలేదు. మిఠాయిల్లోనూ నాణ్యత ఉండడంలేదని గతంలో ఫిర్యాదులు, తనిఖీల్లో వెలుగులోకి వచ్చాయి. నాసిరకం వంట నూనెలు తయారవుతున్నాయి. అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ వెలుగులోకి వచ్చినా పూర్తిగా నియంత్రించలేకపోతున్నారు.

**జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు కనీస సమీక్ష చేయడం లేదు.**

బయటి ఆహారం తినడంలో చాలా రోగాలు వచ్చే అవకాశముంది. వీలైనంత వరకు తగ్గించుకుంటే మంచిది. ప్రస్తుతం చాలా మంది ఆర్డర్ పెట్టి ఫుడ్ ఇంటికి తెప్పించుకుంటున్నారు. వారు ప్రమాదకరమైన కవర్లలో ప్యాకింగ్ చేస్తున్నారు. మంచి నూనె వాడకపోవడం, వాడినా నూనెనే మళ్లీ వాడడంతో కడుపు నొప్పి వాంతులు, విరేచనాలు, బరువు పెరగడం, అజీర్ణం, బీపీ, మధుమేహం, శరీరంలో రోగనిరోధకశక్తి తగ్గిపోవిడం, కాలేయ సంబంధిత వ్యాధులు వస్తాయి. తర్వాత అది పచ్చకామెర్లకు దారి తీసి క్యాన్సర్ కూడా రావచ్చు. కవర్లలో టీ, కూరలు, బిర్యానీ పార్సిల్ తీసుకుపోతుంటారు. ఇది అత్యంత ప్రమాదకరం. క్యాన్సర్ వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయని వైద్యులు పేర్కొంటున్నారు.

**కఠిన శిక్షలు..**

పరిరక్షణ లేని ఆహారాన్ని ఎవరు తయారు చేసినా, అమ్మినా, నిల్వ చేసినా, సరఫరా చేసినా ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్ యాక్ట్ 2006 చట్టం ద్వారా శిక్షతోపాటు జరిమానా విధిస్తారు. అనుమతిలేకుండా విక్రయిస్తే ఆరు నెలల జైలు, రూ.లక్ష వరకు జరిమానా వేస్తారు. ఆరోగ్యానికి హానికరంగా ఉంటే ఏడాది జైలు శిక్ష రూ.3లక్షల వరకు జరిమాన ఉంటుంది. తీవ్ర అనారోగ్యానికి గురి చేసే ఆహార పదార్థాలైతే ఆరు నెలల జైలు శిక్ష రూ.5లక్షల వరకు జరిమానా వేస్తారు. మృతికి కల్తీ ఆహారం కారణమైతే జీవిత ఖైదు, రూ.10లక్షల వరకు జరిమానా విధించే అవకాశాలు ఉన్నాయి.

## ఐటి కారిడార్‌లో పర్యటించిన గ్రేటర్ కమిషనర్ రోనాల్డ్ రాస్

**-వరద నీరు నిలిచిపోతున్న ప్రాంతాలపై యాక్షన్ ప్లాన్‌కు ఆదేశం**



వరద నీరు నిలిచిపోయే ప్రాంతాలను పరిశీలిస్తున్న గ్రేటర్ కమిషనర్ రోనాల్డ్ రోస్ తదితరులు

**గచ్చిబౌలి, మే 17 ప్రభాతవార్త**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఐటి కారిడార్‌లో వర్షం పడిన ప్రతిసారి వరద నీరు రహదారుల మీద నిలిచిపోయి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వరద నీరు నిలిచిపోతున్న ప్రాంతాల మీద ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించాలని జీహెచ్ఎంసీ కమీషనర్ రోనాల్డ్ రోస్ అధికారులకు సూచించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఐటి కారిడార్ ప్రాంతంలో శుక్రవారం గ్రేటర్ కమీషనర్ అధికారులతో కలిసి ఆకస్మిక పర్యటన చేపట్టారు. ఐటి కారిడార్ పరిధిలో ట్రాఫిక్ రద్దీ తీవ్రంగా ఉండే ప్రాంతాలు, వరద నీరు నిలిచిపోయే ప్రాంతాలను జోనల్ కమీషనర్ స్నేహ శబరీష్‌తో కలిసి గ్రేటర్ కమీషనర్ పరిశీలించారు. గురువారం కురిసిన భారీ వర్షానికి మాదాపూర్ ఐటి కారిడార్ పరిధిలో తీవ్రంగా ట్రాఫిక్ జాం జరిగి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. దీంతో పాటు గతకొన్ని రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి ఐటి కారిడార్‌లో గ్రిడ్ లాక్ అయ్యింది. ఈ విషయమై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడడం, పిర్యాదులు ఎక్కువ కావడంతో శుక్రవారం గ్రేటర్ కమీషనర్ అధికారులతో కలిసి పర్యటించారు. ఐటి కారిడార్ పరిధిలోని బయోడైవర్సిటీ జంక్షన్, క్యూమార్ట్, మాదాపూర్ ప్రధాన రహదారి, బొటానికల్ గార్డెన్ రోడ్డు, డిఎల్ఎఫ్ రహదారుల్లో పర్యటించి వరద నీరు నిలిచిపోయే ప్రాంతాలను పరిశీలించారు. వర్షాలు కురిసినప్పుడు వరద నీరు సజావుగా సాగేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. భారీగా వరద నీరు నిలిచిపోయే ప్రదేశాల్లో బాక్స్ డ్రైన్ నిర్మాణానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో వెస్ట్‌జోన్ డిప్యూటీ కమీషనర్ ఉపేందర్‌రెడ్డి, శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమీషనర్ రజనీకాంత్‌రెడ్డి, ఈఈ శ్రీనివాస్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఎండిఎంఎ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్న సైబరాబాద్ ఎస్ఓటి పోలీసులు..

**మూసాపేట, మే 17, ప్రభాతవార్త :** విశ్వసనీయ సమాచారం మేరకు సైబరాబాద్ ఎస్ఓటీ మాదాపూర్ టీమ్, కూకట్‌పల్లి పోలీస్‌లు శుక్రవారం కూకట్‌పల్లి స్టేషన్ పరిధిలోని శేషాద్రినగర్‌లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఇద్దరు యువకులు నీలేష్‌రెడ్డి (26), కట్టా రాజశేఖర్‌రెడ్డి (29)లను అదుపులోకి తీసుకుని వారి వద్దనుండి 3 గ్రాముల ఎండిఎంఎ డ్రగ్‌ను స్వాధీనం చేసుకుని వారిని విచారిస్తున్నారు. బెంగుళూరులో పనిచేస్తున్న వీరి స్నేహితుడు ప్రేమ్ సాయి అనే యువకుడు వీరికి సప్లయి చేస్తున్నట్లు తెలుస్తోంది.

**మరోకేసులో :** సైబరాబాద్ ఎస్ఓటీ మాదాపూర్ టీమ్, జగద్గిరిగుట్ట పోలీసులు జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలకృష్ణ హైస్కూల్, తులసినగర్ వద్ద ఇద్దరు విద్యార్థులు రోహిత్ (23), తిలక్‌సింగ్ (22)లను పట్టుకుని వారి వద్ద నుంచి 2 చిన్న జిప్ కవర్‌లో 3 గ్రాముల ఎండిఎంఎ మాదకద్రవ్యాన్ని, చిన్న ప్యాకెట్లలో ఉన్న 45 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు కేసుల్లోనూ నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారిస్తున్నారు.

### ఎమ్మెల్యే కారు నంబర్‌తో మరోవ్యక్తి చలామణి..

**పేట్ బషీరాబాద్, మే 17, ప్రభాతవార్త :** మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ కారు నంబర్‌తో మరోవ్యక్తి చలామణి చేస్తుండడంతో ఎమ్మెల్యే పీఏ పేట్ బసీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 11న మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌కు సెల్‌ఫోన్‌కు ట్రాఫిక్ విభాగం నుండి సందేశం వచ్చింది. దానిని ఓపెన్ చేసి చూడగా ఈనెల 9న ఉదయం 10.11 గంటలకు సూర్యాపేట ట్రాఫిక్ పీఎస్ పరిధిలో అతివేగంతో దూసుకెళ్లడంతో ఫైన్ వేసినట్లు రావడంతో ఆ ఫోటోను పరిశీలించారు. అయితే తన వద్ద ఉన్న జీఎంసీ సియరా బ్లాక్ కలర్ వాహనం కాకుండా ఫోటోలో వోక్స్ వ్యాగన్ వైట్‌కలర్ కారు కనిపించింది. తనకారు నంబర్‌తో మరో వ్యక్తి చలామణి అవుతున్నాడని తెలుసుకొని దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే పీఏ ఎస్.ఆదిత్యరావు ఈనెల 16న పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### స్వల్ప విషయమై బావపై దాడి చేసిన బావమరదులు

**బేగంబజార్,మే17ప్రభాతవార్త :** భార్య,భర్తల మధ్య స్వల్ప వివాదం చివరకు కట్టుకున్న భార్య ఎదురుగానే బావమరుదుళ్లు బావపై దాడి చేసిన సంఘటన బేగంబజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈసంఘటనకు సంబంధించిన వివరాలను ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ కథనం ప్రకారం..బేగంబజార్ తోఫ్‌ఖానా ప్రాంతానికి చెందిన రామేశ్వర్,భార్య సంతోషిలకు కొద్ది రోజులక్రితం స్వల్పవివాదం చోటుచేసుకుంది. భర్తపై అలిగిన సంతోషి అమ్మగారి ఇంటికి వెళ్లింది. ఈనెల10వ తేదిన సం తోషి సోదరులు రామకృష్ణ,హరికృష్ణలతో కలిసి భర్త రామేశ్వర్ ఇంటికి వచ్చారు. దీంతో రామేశ్వర్ భార్యసంతోషిని చూసి తీవ్రఆగ్రహంతో ఊగిపోయాడు. సంతోషి,రామకృష్ణ, హరికృష్ణ, రామేశ్వర్‌కు వాగ్వివాదం చోటు చేసుకుంది. తీవ్ర ఆగ్ర హంతో రెచ్చిపోయినరా మకృష్ణ, హరికృష్ణలు రామేశ్వర్‌పై కట్టెలతో దాడి చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. స్థానికులు వెంటనే 100 డయల్ చేయగా పోలీసులు అక్కడికి చేరుకుని దాడికి పాల్పడిన వారిపై 324,506,504 సెక్షన్లపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. సోషల్ మీడియాలో వచ్చిన వాటిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు.

### మాదాపూర్‌లో రోడ్డు ప్రమాదం..ఒకరు మృతి

**గచ్చిబౌలి, మే 17 ప్రభాతవార్త :** మితిమీరిన వేగంతో దూసుకువచ్చిన కారు రహదారి పక్కన నిలిపి పాల ప్యాకెట్ల లోడింగ్ చేస్తున్న రెండు ఆటోలను ఢీకొట్టడంతో మాదాపూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో పాల వ్యానుతో వచ్చిన ఓ వ్యక్తి మృతిచెందగా, మరో వ్యక్తి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... మాదాపూర్ గుట్టల భేగంపేటలో నివాసం ఉండే మాదాసు సత్యనారాయణ(44), ఇతని సోదరుడు మేగా హిల్స్ ప్రాంతంలో నివాసం ఉండే మాదాసు శ్రీనివాస్(35)తో కలిసి స్థానికంగా పాల ప్యాకెట్ల వ్యాపారం చేస్తుంటాడు. ఈ క్రమంలో తమ ఆటో ట్రాలీ టాటా అపే (టిఎస్07 యుహెచ్2649)లో పాల ప్యాకెట్ల కోసం మాదాపూర్ పిల్లర్ నెంబరు 1715 సమీపంలోని హనుమాన్ గుడి వద్దకు శుక్రవారం తెల్లవారు జామున 4 గంటల ప్రాంతంలో వెళ్లారు. చిత్రపురి కాలనీలో నివాసం ఉంటూ టాటా ఎస్ వాహనం నడిపేసంకు వీర రాఘవులు తన ఆటో (టిఎస్08 యుజె4463)లో అక్కడికి వచ్చాడు. రెండు ఆటోలను రహదారి పక్కన ఒకదాని వెనుక ఒకటి పెట్టి ఒక ఆటోలో ఉన్న పాల ప్యాకెట్లను మరో ఆటోలో లోడ్ చేస్తున్నారు. ఈ క్రమంలో తెల్లవారుజామున 4.40 ప్రాంతంలో అదే దారిలో మితిమీరిన వేగంతో వచ్చిన కియా కార్నివాల్ వాహనం అదుపుతప్పి మొదట వీర రాఘవులు ఆటోను ఢీకొట్టింది. అనంతరం వేగం నియంత్రణ కాకపోవడంతో వేగంగా వచ్చి మాదాసు శ్రీనివాస్ ఆటోను ఢీకొట్టింది. అదే సమయంలో పాల ప్యాకెట్ల లోడింగ్ చేస్తున్న మాదాసు శ్రీనివాస్, సంకు, వీర రాఘవులను బలంగా ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన శ్రీనివాస్, వీర రాఘవులులను స్థానికులు వెంటనే ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శ్రీనివాస్ మృతిచెందాడు. వీర రాఘవులు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. హైటెక్‌సిటీ నుంచి జూబ్లీహిల్స్‌కు జీ.రాజేష్ అనే వ్యక్తి తన కియా కార్నివాల్ వాహనంలో మితిమీరిన వేగంతో వెళ్తూ అదుపుతప్పడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. ఈమేరకు శ్రీనివాస్ మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.




# ఈ నగరానికి ఏమైంది?

**-పొంచి ఉన్న ప్రమాదంగా భాగ్యనగరం -తప్పిపోయిన వారి పాలిట 'అ'భాగ్య నగరం**

**- మిస్సింగ్ కేసులతో అతలా కుతలం - క్షేమంగా ఇంటికి చేరిన వారు 6మంది -చనిపోయిన దాఖలాలు 29**

**హైదరాబాద్, మే17, ప్రభాతవార్త:** నగరంలో మిస్సింగ్ కేసులు సమస్యాత్మకంగా మారాయని పోలీసులు, నేర పరిశోధక నిపుణులు చెబుతున్నారు. నిత్యం నమోదయ్యే మిస్సింగ్ కేసులు చివరకు రెండు పరిస్థితులకు దారి తీస్తాయని వారన్నారు. అందులో ఒకటి తప్పిపోయిన వారిని మానవత్వం గల సామాన్యులు పోలీసుల సహాయంతో వారి కుటుంబీకుల వద్దకు చేరుస్తారు, లేదా ఆశ్రయం కలిపిస్తారు. వారు వృద్దులైతే ఓల్డేజ్ హోంలో చేరుస్తారు. మరికొన్ని సందర్భాలలో మిస్సయిన వ్యక్తులు వివిధ ప్రమాదాలకు గురై శవాలుగా మారుతున్నారు. గత సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా 1336 మిస్సింగ్ కేసులు అధికార పూర్వకంగా నమోదవ్వగా, ఈ ఏడాది 550కి పైగా నమోదయినట్లు సమాచారం. కాగా ఈ సంవత్సరం ఇప్పటి వరకూ నగర పరిధిలో కేవలం 6 మిస్సింగ్ కేసులలో మాత్రమే తప్పిపోయిన వ్యక్తులు క్షేమంగా తమ కుటుంబీకుల వద్దకు చేరగా, 29 కేసుల్లోని బాధితులు మరణించారని అధికారులు తెలిపారు. దీన్ని బట్టి సామాన్యులు ఎటువంటి విపరీత పరిస్థితుల్లో ఉన్నారో అర్థమవుతోంది. మిస్సింగ్ కేసులు కొన్నిటిలో తప్పిపోయిన వారు మండుటెండలు, అకాల వర్షాలకు తాళలేకపోవడం, యాక్సిడెంట్, అనారోగ్యం, హత్య వంటి రకరకాల ప్రమాదాలకు గురవడం వల్ల మరణిస్తున్నారు. సాధ్యమైనంత వరకూ ఇంటికి దారి తెలియక సతమతమవుతుంటే మానవత్వంతో కూడిన సామాన్యులతో పాటూ, తమ విధులలో భాగంగా స్థానిక పోలీసులు వారికి రక్షణ కల్పిస్తుంటారు. ఈ నేపథ్యంలో నిత్యం నమోదయ్యే మిస్సింగ్ కేసుల దర్యాప్తు ప్రకారం వయసుతో సంబంధం లేకుండా ఎవ్వరైనా మిస్సయ్యే అవకాశాలున్నాయని పోలీసులు పేర్కొన్నారు. మనమంతా ప్రమాదకరమైన పరిస్థితులలో ఉరకల పరుగుల జీవితాలు వెళ్ళదీస్తున్నామనీ, మనల్ని మనం కాపాడుకుంటూ, తప్పిపోకుండా మన వారిపై ఒక కన్ను వేసి అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**త్రాగుడుకి బానిసై ఇల్లొదిలి వెళ్ళిపోయాడు...**

**మిస్సింగ్ కేసుగా మారి గుర్తు తెలియని శవంగా తేలాడు:**

తాగుడుకి బానిసైన వ్యక్తి మిస్సింగ్ కేసుగా మారి గుర్తు తెలియని శవంగా తేలిన ఘటన మలక్‌పేట ప్రాంతంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే, మలక్‌పేట కాలనీలో యూపీ శర్మ ఆసుపత్రి వద్ద గుర్తు తెలియని వ్యక్తి శవం లభించినట్లు పెట్రోలింగ్‌లో ఉన్న స్థానిక పోలీసులకు సమాచారం అందడంతో అక్కడికి చేరుకున్నారు. మృతుడు యాక్సిడెంట్‌లో చనిపోయినట్లు అనుమానిస్తున్నారు. చనిపోయిన వ్యక్తి వయసు 40 నుండి 45 మధ్య ఉన్నట్లు తెలిపారు. అనంతరం 108 అంబులెన్స్‌కి ఫోన్ చేసి మృతదేహాన్ని ఉస్మానియా జెనరల్ హాస్పిటల్‌కి తరలించారు. కాగా మృతుడు ఎవరు ఏమిటి అనే వివరాలు శుక్రవారం వెలుగు చూశాయి. మృతుడు ఉప్పల్ ప్రాంతానికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తిగా తేలింది. బార్బర్‌గా పని చేసే శ్రీనివాస్ తాగుడుకి బానిసవగా, ఈ వ్యసనంపై అతని భార్య తరచూ గొడవ పడేది. ఇక అతడితో ఉండలేక ఇటీవలె ఆమె తన పుట్టింటికి వెళ్ళిపోయింది. దాంతో శ్రీనివాస్ తాగుడు మానకపోగా ఇల్లు వదిలి వెళ్ళిపోయాడు. అప్పటినుంచీ అతడి బావ మరిది, మామయ్యలు శ్రీనివాస్ గురించి వెతకడం మానలేదు. మిస్సింగ్ కంప్లైంటిచ్చి పోలీసుల సాయంతో వెతకడం కొనసాగించారు. పోలీసు బృందాలతో పాటూ వారితో పని చేసే ప్రైవేటు ఆర్గనైజేషన్ల ద్వారా ఇంటినుంచి వెళ్ళిపోయిన శ్రీనివాస్ ఫొటో, మలక్‌పేటలో లభించిన గుర్తుతెలియని శవం ఫొటో ఒక్కటేనని నిర్ధా రించారు. త్రాగుడుకి అలవాటు పడ్డ శ్రీనివాస్ తన శరీరం స్వాధీనంలో లేకపోవడం వల్ల యాక్సిడెంట్‌కి గురై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

# నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు...

**- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హెచ్చరిక**

**హైదరాబాద్, మే 17,ప్రభాతవార్త:** జిల్లాలోని అన్ని ఆసుపత్రులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని లేనిపక్షంలో ఆయా ఆసుపత్రులపై కటిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హెచ్చరించారు. ఈమేరకు శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్లినికల్ ఎస్టాబ్లిషమెంట్ ఆక్ట్ సమావేశానికి చైర్మన్ హోదాలో హాజరైన కలెక్టర్ పలు సూచనలు చేయడంతోపాటు ప్రైవేట్ ఆసుపత్రులను హెచ్చరించారు. క్లినిక్‌లు, పాలీ క్లినిక్‌లు, హాస్పిటల్స్ నడిపేవారు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. హాస్పిటల్ , వెల్‌నెస్‌సెంటర్లు, ఫీజియోథెరఫీ సెంటర్లు, కంటి క్లినిక్‌లతోపాటు ఆయుర్వేద, యునాని ,హోమియో ,సిద్ద యోగ ,నేచురోపతి వంటి అన్ని హాస్పిటల్స్, క్లినిక్‌లు కూడా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. లేనిపక్షంలో పెనాల్టీవేయడంతోపాటు వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోన్నుట్లు తెలిపారు.

**ఫీజుల వివరాలతో బోర్డు ఏర్పాటు చేయాలి ...**

క్లినిక్, పాలిక్లినిక్, నర్సింగ్‌హోమ్ , హాస్పిటల్ ,ఆయుష్‌క్లినికల్ ఆసుపత్రులు వారు వసూలు చేసే ఫీజుల వివరాలు తప్పనిసరిగా తెలుగు, ఇంగ్లీష్, భాషలో రిసెప్షన్ వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలి ,పాతబస్తీలో అయితే ఉర్దూలో కూడా ఏర్పాటు చేయాలి. బోర్డులో పెట్టిన దాని ప్రకారమే రోగుల నుంచి చార్జీలు వసూలు చేయాలి అలాకాకుండా అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ప్రతి హాస్పిటల్, నర్సింగ్‌హోమ్ వారు నిర్ణయించుకన్న రేట్స్ (రాక్‌రేట్స్) ప్రతి సంవత్సరం జూన్ నెల మొదటివారంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో అందజేయాలి.

**తప్పనిసరి అయితేనే సీసెక్షన్ ...**

ఆసుపత్రికి వచ్చేరోగులకు తప్పనిసరి అయితేనే సిసెక్షన్ కాన్పులు చేయాలి, అనవసరంగా కాన్పులు చేస్తే వైద్యఆరోగ్యశాఖ అదికారులు కేసు ఆడిట్ చేసి గుర్తిస్తే ఆసుపత్రిలపై చర్యలు తీసుకోవడంతోపాటు తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌కు రాసి సదరు వైద్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. అలాగే ఎంటిపి రిజిస్ట్రేషన్ చేయించుకున వారు మాత్రమే నిబంధనలకు లోబడి ఇద్దరు డాక్టర్ల సమక్షంలో అబార్షన్ చేయాలని రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్లు లేకుండా అర్హత లేని డాక్టర్లు అభార్షన్ చేస్తే చర్యలు తప్పవు. అలాగే గైనకాలజీ, ఏఆర్‌టి, సరోగసీ లెవల్1, లెవల్2 రిజిస్ట్రేషన్లు కలిగిన వారు మాత్రమే ఐవిఎఫ్ సెంటర్లు నడుపుకోవడానికి అర్హులు అని లెవల్1, లెవల్2 సర్టిఫికేట్స్ లేనివారు ఐవిఎఫ్‌సెంటర్ అని పేరుపెట్టుకోవద్దు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**రోగిని పరీక్షించి దానికి అయ్యే ఖర్చు ముందే చెప్పాలి...**

ఆసుపత్రికి వచ్చిన పేషంట్లకు తప్పనిసరిగా వారికి అర్థమయ్యే భాషలో చెప్పడంతోపాటు జబ్బుకు అయ్యేఖర్చులన్నీ ముందుగానే వివరించాలి. అలాగే రోగుల హక్కులు,బాధ్యతలు ప్రతి ఆసుపత్రుల్లో తెలిపే విధంగా బోర్డులు ఏర్పాటు చేయాలి. అంతేకాకుండా నోటిఫిబుల్ వ్యాధులు (మలేరియా ,డెంగ్యూ, టిబి, హెచ్ఐవి)వంటి వ్యాధులు సోకినవారి వివరాలు ప్రతినెల వైద్యఆరోగ్యశాఖకు తెలపాలి

**ఆర్ఎంపి ,పిఎంపి వైద్యులు డాక్టర్ అని రాసుకోవద్దు ...**

ఆర్ఎంపి,పిఎంపి వైద్యులు తమ పేరుకు ముందు డాక్టర్ అని రాసుకోకూడదని ,వారు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని ఇంజెక్షన్, సెలైన్ పెట్టకూడదని కలెక్టర్ తెలిపారు. అలాగే అల్లోపతి వైద్యం చేయరాదని వారి దగ్గర మందుల నిల్వ ఉంచుకోరాదన్నారు. ప్రైవేట్ హాస్పిటల్స్, నర్సింగ్‌హోంలలో ఆయుష్ వైద్యులని డ్యూటీ మెడికల్ ఆఫీసర్‌గా కానీ ,మెడికల్ ఆఫీసర్‌గా కానీ వైద్యం చేసేందుకు నియమించుకోకూడద ,నియమించుకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలగే విదేశాలల్లో వైద్యవిద్య అభ్యసించిన డాక్టర్లు తప్పనిసరిగా ఎఫ్ఎంజిఐ టెస్టులో ఉత్తీర్ణులై, తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో రిజరిస్ట్రేషన్ చేయించుకుని తర్వాతే హాస్పిటల్స్‌లో పనిచేయాలన్నారు. నగరంలో చాలామంది ఎఫ్ఎంజిఈ పరీక్ష పాస్‌కాకుండానే హాస్పిటల్స్‌లో పనిచేస్తు ప్రాక్టీస్ చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని అలాంటి వారిని ప్రత్యేక బృందాల ద్వారా తనిఖీ చేయించి ఆసుపత్రుల యాజమాన్యాలపై ,వైద్యులపై కఠిన చర్యలు తీసుకుంటాని హెచ్చరించారు.

## మున్సిపల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

**-రాష్ట్ర మున్సిపల్ పాలన కమిషనర్ దివ్య**



దివ్యతో చర్చిస్తున్న ప్రభాకర్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాసులు తదితర నాయకులు

**నాంపల్లి, మే 17 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 134 మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల న్యాయమైన కోర్కెల పరిష్కార దిశగా తన వంతు కృషిచేస్తానని రాష్ట్ర మున్సిపల్ పాలన కమిషనర్ డి.దివ్య అన్నారు. తెలంగాణ మున్సిపల్ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు జి.ప్రభాకర్ యాదవ్ సారథ్యంలో కార్యదర్శి వెంకట్ గోపాల్, సహాధ్యక్షుడు బి.హెచ్.శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి శ్రీనివాసులు, నాయకులు శ్రీధర్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులతో కలిసి శుక్రవారం భేటీ అయిన ఉద్యోగ సంఘ నాయకులు ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఆమెతో చర్చలో నాయకులు ప్రస్తావించిన విషయాలపై సానుకూలత, సుహృద్భావ వాతావరణంలో సాగినట్లు తెలిపారు. ఉద్యోగుల పదోన్నతులపై ఉన్న సర్వీస్ అడ్డంకులు, మేనేజర్‌స్థాయి ఉద్యోగి బాధ్యతలు సక్రమంగా అమలయ్యేలా ప్రాపర్‌ఛానెల్ తదితర అంశాలను నాయకులు ప్రస్తావించారు. ఖాళీ పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టాల్సిన ఆవశ్యకతను వివరించారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వచ్చేనెల మొదటి వారం తర్వాత అధికారులతో చర్చించి తగిన చర్యలు చేపడుతానని భరోసానిచ్చారు.

## పౌల్ట్రీ రైతులకు ఆస్తిపన్నులో మినహాయిపు ఇవ్వండి


మంత్రికి విన్నతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్, మే 17, (ప్రభాతవార్త) : పౌల్ట్రీ రైతులకు పాత బయకాయిలు అయిన ఆస్తి పన్నుల్లో మిన హాయింపు ఇవ్వాలని శుక్రవారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలుసుకున్నారు. ఈ మేరకు ఆయనకు పౌల్ట్రీ రైతులకు జారీ చేసిన ఆదేశాలను రద్దు చేయాలని కోరుతూ మంత్రికి ఎమ్మెల్యే శంకర్ వినతిపత్రం అందజేశారు. అనంతరం పౌల్ట్రీ రైతులు సమస్యలను మంత్రికి వివరించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న విధానాన్ని అనుసరిస్తూ పాతబాకీలను పూర్తిగా రద్దు చేయాలని మంత్రిని కోరడం జరిగిందని ఆయన తెలిపారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారు : శ్రీనివాస్

**కంటోన్మెంట్,మే 17 ప్రభాతవార్త:** విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తే విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తా_రని, అందు వల్ల టీచర్లు ప్రత్యేక చొరవ తీసుకొని చక్కటి విద్యా బోధ న అందించాలని అక్షర వాగ్దేవి, ఆర్.జి. ఆర్.సిద్ధాంతి విద్యాసంస్థల ఫౌండర్, వైస్ చైర్మన్ పి.ఎల్. శ్రీనివాస్ తెలిపారు. కంటోన్మెంట్‌లోని అక్షర వాగ్దేవి ఇంటర్నేషనల్ స్కూల్ సిబిఎస్ 10వ తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించినందుకు పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల అభినం దన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 2023 -24 విద్యా సంవత్సరంలో విద్యార్థులు 97 శాతం టాపర్‌గా రావడం గర్వకారణ మన్నారు. వచ్చే వి ద్యా సంవత్సరంలో అక్షర వాగ్దేవి స్కూల్‌లో 10వ స్థానంలో నిలువాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సుశీల్ కుమార్, అలేఖ్యప్రతాప్, సిఈఓ మల్క యశస్వి, ప్రిని స్పాల్ వనజ, వైస్ ప్రిని స్పాల్ రచనా సింగ్ తదితరులు పాల్గొన్నా రు. ఈ సందర ్భంగా సూ ్కల్ టాపర్ ్గా నిలిచిన శ్రీ సువాన్, సి.హెచ్.హాసిని, గాలి రాజేశ్వరి, పగడాల రసజ్ఞలకు ప్రోత్సాహక బహుమతులను అందజేసి అభినందించారు.

## చెరువుల పునరుద్ధీకరణతో రైతులకు ఎంతో మేలు


డ్రోన్ కెమెరాతో చెరువును పరిశీలిస్తున్న ఏపిడి చరణ్‌గౌతమ్

**జిల్లెడు చౌదరిగూడ, మే 17,(ప్రభాతవార్త):** గ్రామాల్లోగల చెరువుల పునరుద్ధీకరణతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఉపాధి హామీ ఏపిడి చరన్‌గౌతమ్ అన్నారు. శుక్రవారం జిల్లెడు చౌదరిగూడ మండంలోని ఎల్కగూడ, గాలిగూడ, గుంజల్‌పహాడ్ గ్రామాల్లో గల అమృత్ సరోవర్ చెరువులను ఆయ న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్ సరోవర్ చెరువులను ఉపాధి హామీ ద్వారా అభివృద్ధి చేసినట్లు ఆయన తెలిఎపారు. ప్రస్తుతం చెరువుల స్థితి గతులపై డ్రోన్ కెమెరా ద్వార పరిశీలించినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ ఇంజనేరింగ్ అధికారి స్వేత, ఏపిఓ ప్రవల్లిక, టెక్నికల్ అసిస్టెంట్లు లక్ష్మారెడ్డి, దవోజి తదితరులు ఉన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ


అమ్మ ఆదర్శ పాఠశాలను సందర్శిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ ,తదితరులు

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :** అమ్మ ఆదర్శ పాఠశాలలో 30లోగా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని కొంపల్లి ఆదర్శ పాఠశాలలో చేపడుతున్న పనులను అదనపు కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి జరుగుతున్న పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ జూన్ మాసంలో పాఠశాలలు తెరుచుకునేసరికి జరుగుతున్న అన్ని పనులు పూర్తి చేయాలన్నారు. పనులు అన్నింటిని మే 30లోగా పూర్తి చేసినందుకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. చేపడుతున్న పనుల్లో ఎలాంటి నాణ్యత లోపం లేకుండా జరగాలని తెలిపారు. ఆదర్శ పాఠశాలల్లో కలర్ వేయడం, టాయిలెట్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆయన సూచించారు. అదనపు కలెక్టర్‌తో పాటు మున్సిపల్ కమిషనర్ జాకీర్ హుస్సేన్‌లు ఉన్నారు.

### రైతుల శ్రమను దోచుకుంటున్నారు: ఎంపిపి


రైతులతో మాట్లాడుతున్న ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

**ఘట్‌కేసర్, మే 17, ప్రభాతవార్త:** ఆరుగాల ం కష్టించి పండించిన పంటకు తగిన గిట్టుబాటు రాక రైతులు నష్టపోతు న్నారని ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు. రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న వరిధాన్యంలో తరుగు పేరుతో 5 కిలోల చొప్పున అధికంగా తూకం వేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జడ్పీ సర్వసభ్య సమావేశంలో అధిక తూకంపై నిలదీయగా అధికారులు సరైన సమాధానం ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్న విధంగా రైతులకు న్యాయం జరగడం లేదని ఆయన విమర్శించారు. అసలే అకాల వర్షాలకు ధాన్యం తడిసి రైతులు ఆందోళన చెందుతుండగా అధికారులు తరగు పేరుతో రైతుల నుంచి అధికంగా తూకం వేసుకోవడం తగదన్నారు. రైతులు దోపిడికి గురైతే సహించబోమని పోరాటానికి సిద్దంగా ఉన్నామని ఎంపిపి స్పష్టం చేశారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన పిఎసిఎస్ చైర్మన్



**బొంరాస్‌పేట , మే 17, (ప్రభాతవార్త) :** బొంరాస్‌పేట్ మండల పరిధిలోని పిఎసిఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను పిఎసిఎస్ చైర్మన్ జయకృష్ణ సభ్యులతో కలిసి పరిశీలించారు. వర్షాలు ప్రారంభమవుతున్న సందర్భంగా ధాన్యం తడవకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వా హకులకు సూచించారు. కొనుగోలు చేసి ధాన్యాన్ని వర్షానికి తడవకుండా వెంటను రైస్ మిల్లులకు తరలించాలని ఆయన సూచించారు. రైతులు సరైన తేమశాతంతో కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకురావాలని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలని రైతులకు ఆయన సూచించారు.

### ధారూర్ మండల కేంద్రంలో..

**ధారూర్, మే 17, ప్రభాతవార్త :** మండల పరిధిలోని నాగారం గ్రామంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని పిఎసిఎస్ చైర్మన్ సత్యనారా యణరెడ్డి శుక్రవారం సందర్శించారు. గురువారం కురిసిన భారీ వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి రైతులు ఇబ్బందులకు గురయ్యారని దీంతో కేంద్రానికి వచ్చిన ధాన్యం సైతం తడిసి ముద్దయిందని అన్నా రు. మిల్లర్లు తడిసిన ధాన్యంలో తరుగు పేరుతో కోతలు విధిస్తున్నారని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతుల కు న్యాయం జరిగేలా చూసామని అన్నారు. పిఎసిఎస్ సిఈవో నర్సింలు విష్ణువర్ధన్ రెడ్డి శ్రీనివాస్ రైతులు వెంకటయ్యగౌడ్ వెంకట్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి సుదర్శన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


రైతులతో మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

## పబ్లిసిటీ ఫుల్.. పర్మిషన్ నిల్..




**షాద్‌నగర్, మే 17, (ప్రభాతవార్త) :** విద్యార్థుల భవిష్యత్తుకు పునాధులు వేసే విద్యారంగాన్ని కొన్ని ప్రైవేటు రంగ సంస్థలు పూర్తిగా భ్రష్టు పట్టిస్తున్నాయి. తల్లిదండ్రుల అవసరాలను ఆసరాగా చేసుకొని ఇష్టానుసారంగా పాఠశాలలను నెలకొల్పుతున్నారు. ఒక విద్యాసంస్థ నెలకొల్పలాంటే దానికి ప్రభుత్వ పరంగా పరిమిషన్లు అవసరం కానీ షాద్‌నగర్‌లో మాత్రం అవి ఏవి లేకుండానే ఫుల్ పబ్లిసిటీతో పాఠశాలలను నెలకొల్పేస్తున్నారు ఎంచక్కా నడిపేస్తున్నారు.

**నిబంధనలుండవా..?**

నూతనంగా ఓ పాఠశాలను ఏర్పాటు చేయాలంటే ముందుగా విద్యాశాఖ నుంచి ఓపెనింగ్ పరిమిషన్ తీసుకోవాలి కానీ ప్రస్తుతం షాద్‌నగర్‌లో నెలకొల్పుతున్న పాఠశాలలు ఇప్పటి వరకు ఓపెనింగ్ పరిమిషనే తీసుకో కుండా ఎంచక్కా పబ్లిసిటీ చేసుకుంటూ అడ్మిషన్లు ప్రారంభించేస్తున్నాయి. ఇదేమిటని కొందరు తల్లి దండ్రులు అడిగితే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాం త్వరలోనే వస్తాయని బుకాయిస్తూ అధికారుల అండ దండలతో కాలం వెళ్లదీస్తున్నారు. అదేవిధంగా ఒక స్కూల్ బిల్డింగ్ సుమారు 12 ఫీట్ల కంటే ఎక్కువ ఎత్తులో ఉంటే ఆ బిల్డింగ్‌కు తప్పని సరిగా ఫైర్ పరిమిషన్ తీసుకోవాలి కానీ ప్రస్తుతం షాద్‌నగర్‌లో ఫైర్ పరిమిషన్ తీసుకున్నవి పాత వాటిలో కొన్ని మాత్రమే ఉన్నాయి. ఇక నూతనంగా ప్రారంభిస్తున్న పాఠశాలలు మాత్రం అసలు ఫైర్ పరిమిషన్ లేకుండానే నడిపిస్తున్నాయంటే అతిశయోక్తి లేదు. స్కూల్ భవనంతో పాటు ఏ పాఠశాలకు అయిన ప్రధానంగా ఆటస్థలం ఉండాలి కానీ ఇక్కడ ప్రస్తుతం ప్రారంభిస్తున్న పాఠశాలలకు సరియైన ఆటస్థలాలు లేవు, అదేవిధంగా గతంలో కొనసాగుతున్న పాఠశాలల్లో కొన్ని మాత్రం ఎలాంటి ఆట స్థలాలు లేకుండానే ప్రైవేటు స్థలాలను కొద్ది రోజులకు లీజ్‌కు తీసుకొని తల్లిదండ్రులను బురిడి కొట్టిస్తూ విద్యార్థుల అడ్మిషన్లు తీసుకుంటున్నాయి.

**విద్యార్థుల తల్లిదండ్రులు తస్మాత్ జాగ్రత్త...**

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు పాఠశాలలతో విద్యార్థుల తల్లిదండ్రులు తస్మత్ జాగ్రత్త... బ్రాండ్ చూసి మోసపోకుండా మొదటగా ఆ పాఠశాలకు ఉండాల్సిన అన్ని పరిమిషన్లు సక్రమంగా ఉన్నాయో లేవో ఒకటి రెండు సార్లు పరిశీలించిన తరువాతనే మీ చిన్నారులను ఆయా స్కూళ్లల్లో చేర్పించండి. పాఠశాలకు పరిమిషన్ లేకుంటే అధికారులు సీజ్ చేస్తే మొదటికే మోసం వస్తుంది. ప్రధానంగా ఓపెనింగ్ పరిమిషన్, ఫైర్ పరిమిషన్, మున్సిపల్ పరిమిషన్, సౌండ్ పోలిషన్ పరిమిషన్, ఆట స్థలం వంటి అన్ని పరిశీలించుకోవాల్సి న అవసరం ఎంతైన ఉంది.

**అంతంత మాత్రంగానే అధికారుల పర్యవేక్షణ**

ప్రైవేటు పరంగా బ్రాండ్ పేర్లతో షాద్‌నగర్‌లో విచ్చలవిడిగా ఓపెనింగ్ అవుతున్న పాఠశాలలపై అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉందని పలువురు పట్టణ వాసులు పేర్కొంటున్నారు. ఎదైనా జరగరానిది జరిగినప్పుడే పాఠశాల యొక్క లొసుగులు బయటకు వస్తాయి తప్ప ముందగా అధికారులు పర్యవేక్షించి చట్టపరంగా లేని పాఠశాలపై ఎలాంటి చర్యలు తీసుకోరని బహటంగానే విమర్శిస్తున్నారు. ఇకనైనా పుట్టగొడుగుల్లా పుట్టకొస్తున్న ప్రైవేటు పాఠశాలలపై అధికారులు పూర్తిస్థాయిలో పర్యావేక్షణ నిర్వహించి నిబంధనలకు విరుద్దంగా నడుపుతున్న విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యావంతులు కోరుతున్నారు.




రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు పరిశీలిస్తున్న డిఆర్ఎం

## వేగవంతంగా రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు

### పరిశీలించిన డిఆర్ఎం భర్తేష్ కుమార్ జైన్

**తాండూరు, మే 17, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరు రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని.. మరో పది నెలల్లో తాండూరు రైల్వే స్టేషన్ రూపురేఖలు మారబోతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే శాఖ డివిజన్ మేనేజర్(డిఆర్ఎం) భర్తేష్ కుమార్ జైన్ తెలిపారు. తాండూరు రైల్వే స్టేషన్‌లో సుమారు రూ.25కోట్లతో అమృత్ భారత్ పథకం కింత చేపడుతున్న ఆధునీకరణ పనులను శుక్రవారం డిఆర్ఎం పరిశీలించారు. స్టేషన్ ముందు భాగంలో ప్లాట్ ఫారాలపై చేపడుతున్న అభివృద్ధి పనులతో పాటు పార్కింగ్, ఎస్కలేటర్, మరుగుదొడ్లు, విశ్రాంత గదుల నిర్మాణ పనులపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అమృత్ భారత్ కింద తాండూరు రైల్వే స్టేషన్ ఆధునీకరణకు సుమారు రూ. 25కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ నిధులతో జిల్లాలోనే తాండూరు రైల్వే స్టేషన్ రూపు రేఖలు మార్చబోతున్నట్లు వివరించారు. ప్రయాణికుల కోసం మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. పనులు వేగవంతంతగా కొనసాగుతున్నాయని, మరో పది నెలల్లో కొత్త హంగులతో రైల్వే స్టేషన్ అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంగ్లీష్ మీడియంలో చదువుకు దరఖాస్తులు స్వీకరణ

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :** బెస్ట్ అవైలేబుల్ పథకం కింద ఇంగ్లీష్ మాధ్యమంలో చదువుకునేందుకు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి తెలిపారు. వికారాబాద్ జిల్లాలో చదువుకున్న ఎస్సీ విద్యార్థుల కొరకు 2024-25 విద్యా సంవత్సరమునకు బెస్ట్ అవైలేబుల్ పథకం కింద ఇంగ్లీష్ మీడియం 1వ తరగతి (డే స్కాలర్) 5వ తరగతి (రెసిడెన్షియల్) విద్యార్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో 88 సీట్లు 1వ తరగతిలో (డే స్కాలర్), 91 సీట్లు 5వ తరగతిలో (రెసిడెన్షియల్) సిట్లు అందుబాటులో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు ఈ సదవకాశాన్ని సద్వినియో గం చేసుకోవాలని తెలిపారు. ఏప్రిల్1, 2024 నాటికి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం లక్షా 50 వేల రూపాయల లోపు గ్రామీణ ప్రాంతములలో నివసించే వారికి అదేవిధంగా పట్టణ ప్రాంతములలో నివసించే వారికి 2లక్షల రూపాయల లోపు వార్షిక ఆదాయం కలిగి ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. కుల,ఆదాయ, (మీ సేవా) ద్వారా పొందిన ధృవీకరణ పత్రములు సమర్పించాలన్నారు. రేషన్ కార్డు,జనన ధృవీకరణ పత్రం,ఆధార్ కార్డు (ఉన్నట్లయితే )2 పాస్ పోర్టు సైజు ఫోటోలతో కార్యాలయ పని దినాలలో జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో మే 18 నుండి దరఖాస్తులు పొందాలని, పూర్తి చేసిన దరఖాస్తులను జూన్ 7 సాయంత్రం ఐదు గంటల లోపు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ఈ పథకమునకు దరఖాస్తు చేసుకొనే విద్యార్థుల కుటుంబ సభ్యులలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ నందు గాని గతంలో బెస్ట్ అవైలేబుల్ స్కీం క్రింద గాని చదువుకున్న వారైతే ఇప్పుడు దరఖాస్తు చేసుకొనుటకు అవకాశం లేదని తెలిపారు. ఆలస్యంగా వచ్చిన దరఖాస్తులు స్వీకరిం చబడవని ఆయన తెలిపారు. 1వ తరగతి యందు దరఖాస్తు చేసుకొనుటకు జూన్ 1,2018 నుండి మే 31 2019 మధ్యలో జన్మించిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. పూర్తి వివరాల కొరకు 99086 90240 నెంబర్‌ను సంప్రదించాల్సిందిగా కలెక్టర్ పేర్కొన్నారు.

## ఆదర్శ పాఠశాల పనులను పూర్తి చేసేందుకు చర్యలు

### జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్లు, అధికారులు

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :** జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం వరి ధాన్యం సేకరణ,ఆదర్శ పాఠశాలలో చేపడుతున్న పనులు,ముఖ్యమంత్రి ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం,ధరణిలో వచ్చిన అర్జీల సమస్యల పరిష్కారం తదితర అంశాలపై ఉన్నతాధికారులతో కలిసి ప్రిన్సిపల్ సెక్రటరీ శాంత కుమారి జిల్లా కలెక్టర్లతో సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ నుండి అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ,లింగ్యా నాయక్,అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి,జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేశ్వర్,జిల్లా మేనేజర్ సుగుణ భాయి,జిల్లా విద్యాశాఖ అధికారి రేణు కాదేవి, డిఆర్‌డిఓ శ్రీనివాస్,డిసిఓ ఈశ్వరయ్య,డిఎల్‌పిఓ సంధ్యారాణిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని పాఠశాలల్లో చేపడుతున్న పనులను క్షేత్రస్థాయిలో పర్యటించి నాణ్యత లోపం లేకుండా పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నమన్నామని అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ వివరించారు. విద్యార్థుల ఏకరూప దుస్తులు,తయారు పూర్తి దశకు చేరుకున్నాయని ఆయన తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ,లింగ్యా నాయక్‌లు అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ...ధరణి ,ముఖ్యమంత్రి ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కార దిశగా పనిచేయాలన్నారు. ముఖ్యమంత్రి ప్రజావాణిలో భాగంగా జిల్లాకు 768 దరఖాస్తులు వచ్చాయని,722 దరఖాస్తుల పరిష్కార నిమిత్తం సంబంధిత శాఖలకు సమర్పించడం జరిగిందని,మిగతా అర్జీలు వివిధ దశలో ఉన్నాయని తెలిపారు.సంబంధిత శాఖలకు వచ్చిన దరఖాస్తులను పోర్టల్‌లో అప్డేట్ చేయాలన్నారు.సంబంధిత వివరాల కాపీలను కలెక్టర్‌కు సమర్పించాలని సూచించారు.జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా వరి ధాన్యాన్ని సేకరిస్తున్నట్లు వారు తెలిపారు.కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించినట్లు వారు వివరించారు.

## బోడుప్పల్ నగర మేయర్‌పై అవిశ్వాసం నోటీసు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :** బోడుప్పల్ నగర మేయర్ సామల బుచ్చిరెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మి రవిగౌడ్‌లపై మెజారిటీ కార్పో రేటర్లు జిల్లా అదనపు కలెక్టర్‌కు అవిశ్వాసం నోటీసు ఇచ్చారు. బోడుప్పల్ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు పోగుల నర్సింహ్మారెడ్డి ఆధ్వర్యంలో కార్పోరేటర్లు అదనపు కలెక్టర్‌ను కలిశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చ ల్ నియోజకవర్గ ఇంచార్జి తోటకూరి వజ్రేష్ యాదవ్, బోడుప్పల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.


బోడుప్పల్ నగర మేయర్‌పై అవిశ్వాసం నోటీసు ఇచ్చిన కాంగ్రెస్ కార్పోరేటర్లు,నాయకులు

## పెద్ద చెరువు పరిధిలో అక్రమ వెంచర్!

## ప్లాట్లను, రోడ్లను తొలగించాలి

### మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు

**శామీర్‌పేట, మే 17, ప్రభాతవార్త** తూంకుంట పెద్ద చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో అక్రమ లేఅవుట్ చేసి ప్లాట్లు విక్రయించారని, చెరువు పరిధి ఎఫ్‌టిఎల్‌లో ఉన్న రోడ్లను, ప్లాట్లను గుర్తించి తొలగించాలని తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్‌కు ఆ తూంకుంట గ్రామ మాజీ సర్పంచు ఎద్దు నాగేశ్ ఫిర్యాదు చేశారు. శామీ ర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ పరిధి తూంకుంటలో ఉన్న పెద్ద చెరువు పరిధిలో ఎఫ్‌టిఎల్ సరిహద్దుల్లో అక్రమంగ లేఅవుట్లు చేసి సుమారు 2ఎకరాల వరకు లే అవుట్ చేసి ప్లాట్లను కొందరు విక్రయించారని అన్నారు. తూంకుంట పెద్ద చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో సరిహద్దుల్లో సర్వేనెంబర్లు 320,322,324లో అక్రమంగ లేఅవుట్ వెంచర్ చేశారని వాటిలో ప్లాట్లు చేసి విక్రయించారని అన్నారు. ఎలాంటి సాంకేతికంగ అనుమతులు లేకుండ అక్రమ లేఅవుట్లను చేశారని అన్నారు. దీనిలో పేదలు ప్లాట్లు కొనుగోలు చేశారని అన్నారు. గతంలోనూ తూంకుంట మున్సిపాల్టీ వారు పలు సార్లు ఆయా సర్వేనెంబర్లలో వెంచర్‌ను వాటిని కూల్చివేయటం జరిగిందన్నారు. ఆ భూముల యజమానులు అక్రమ వెంచర్ చేసి అమాయక ప్రజలకు ప్లాట్లు విక్రయించారని అన్నారు.

తూంకుంట పెద్ద చెరువును గత కొన్ని నెలల కిందట ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు జాయింట్‌గ తూంకుంట పెద్ద చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిని సర్వేచేసి ఎఫ్‌టిఎల్ హద్దు రాళ్లను పాతటం జరిగిం దన్నారు. ఆ ఎఫ్‌టిఎల్ పరిధిలో ఉన్న రోడ్లను, ప్లాట్ల రాళ్లను తొలగించి చెరువు పరివాహక ప్రాంతాన్ని పునరుద్దరించాలని తగు చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆయన కోరారు. గ్రామ పరిధిలో దేవుని స్థలాలు, మాన్యాలు కూడ వదలకుండ ఫేక్ డాక్యుమెంట్స్ సృష్టించి కొందరు ప్లాట్లు చేసి విక్రయించి కోట్లు దండుకుంటున్నారని తగు చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు ఆయన ఫిర్యాదు చేశారు. చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలోనూ, దేవాలయ భూముల్లోనూ కబ్జాలు చేసి ప్లాట్లు చేసి విక్రయించుకుంటున్న వారిపై చట్టరీత్య తగు చర్యలు తీసుకోవాలని తూంకుంట మాజీ సర్పంచు ఎద్దు నాగేశ్ మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసి కోరారు. తూంకుంట పెద్ద చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో జరుగుతున్న అక్రమాలపై, దేవాలయ భూములపై తగు విచారణ జరిపి చట్ట రీత్య తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాలు పట్టివేత

**శామీర్‌పేట, మే 17, ప్రభాతవార్త** మూడుచింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్ గ్రామ పరిధిలో అక్రమంగ మట్టి (మొరం) తవ్వకాలు జరిపి వాహనాల్లో తరలిస్తున్న రెండు వాహనాలను మూడుచింతలపల్లి మండల రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. గురువారం రాత్రి మూడుచింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో అక్రమంగ మట్టి మొరం తవ్వకాలు జరుపుతున్నట్లు, వాహనాల్లో తరలిస్తున్నారన్న సమాచారంతో రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించి రెండు వాహనాలను పట్టుకున్నారు. ఆ రెండు వాహనాలను మూడు చింతలపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం వద్దకు తరలించారు. ఆ రెండు వాహనాలలో అక్రమంగ మట్టి మొరం తరలిస్తున్నట్లు గుర్తించి ఆ వాహనాలకు జరిమానా విధించి తగు చర్యలు తీసుకుంటున్నట్లు రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. అదే విధంగ మూడుచింతలపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లోనూ అక్రమంగ మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు సమాచారం వస్తున్నట్లు, ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని (మొరం)ను తరలించినా వాహనాలకు జరిమానాలు, యజమానులపై కేసులు తగు చర్యలు ఉంటాయని రెవెన్యూ అధికారులు స్పష్టం చేశారు. రాత్రి సమయంలో అక్రమంగ మట్టి మొరం తవ్వకాలు, అక్రమంగ వాహనాల్లో తరలిస్తున్నారని నిఘా పెట్టాల్సి న అవసరం ఉందని, అక్రమంగ మట్టి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని, వాహనాలను సీజ్ చేస్తామని, భారీ జరిమానాలు, కేసులు ఉంటాయని ఎంసిపల్లి మండల రెవెన్యూ అధికారులు హెచ్చరించారు.


మూడుచింతలపల్లి మండలంలో లక్ష్మాపూర్‌లో అక్రమంగ మట్టి తరలిస్తున్న వాహనాలను పట్టుకున్న తహసీల్దార్ కార్యాలయం వద్ద పెట్టిన దృశ్యం

## జిప్సం కర్మాగారంలో భారీ అగ్ని ప్రమాదం

### అగ్నికి ఆహుతైన యంత్రాలు, సామాగ్రి


అగ్ని ప్రమాదంలో కాలిపోయిన జిప్సం కర్మాగారం

**తాండూరు, మే 17, ప్రభాతవార్త :** తాండూరు మండల పరిధిలోని గుంతబాసుపల్లి గ్రామ శివారులో కొనసాగుతున్న ఇండస్‌చెమ్ జీప్సం కర్మాగారంలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. సిమెంట్‌లో కలిపే ముడి సరుకును జీప్సం కర్మాగారంలో తయారు చేస్తారు. గురువారం అర్ధరాత్రి విద్యుత్ షాక్‌తో ఒక్క సారిగా కార్మాగారంలో మంటలు చెలరేగాయి. గమనించిన కార్మికులు వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. అగ్నిమాపక శాఖ అధికారులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేప్రయత్నం చేశారు. భారీగా మంటలు చెలరేగడంతో అగ్నిమాపక అధికారులు కొడంగల్, వికారాబాద్ నుంచి ఫైర్‌ఇంజన్‌లను రప్పించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో కర్మాగారంలో ఉన్న మూడు జేసీబి యంత్రాలతో పాటు మోటార్లు, బోవర్స్, ఫ్యానల్ బోర్డులు, కేబుల్ పూర్తిగా మంటల్లో కాలిపోయాయి. అదేవిదంగా కర్మాగారంలో ఫార్మా కంపెనీ వెస్ట్ మెటీరియల్ కూడా కాలి బూడిదైనట్లు స్థానికులు తెలిపారు. అయితే, ఒక్క సారిగా పెద్ద ఎత్తున మంటలు, పొగ రావడంతో చుట్ట పక్కల గ్రామాల ప్రజలు ఆందోళన చెందారు. మరోవైపు విషయం తెలుసుకున్న కరణ్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

### రైతులకు అందుబాటులో విత్తనాలు, ఎరువులు : ఏవో

**బొంరాస్‌పేట, మే 17, (ప్రభాతవార్త) :** బొంరాస్‌పేట్ ఉమ్మడి మండలంలోని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా 50శాతం రాయితీతో పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగ విత్తనాలు తుంకిమెట్ల దుద్యాల బొంరాస్‌పేట్ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. రైతుల పచ్చిరొట్ట విత్తనాలను పొలా ల్లో చల్లుకుని 45 రోజులకు దమ్ము చేసుకోవాలని పచ్చిరొట్ట ఎరువులను వాడటం వల్ల కలుపు మొక్కలను జింక్ లోపాన్ని నివారించడమేగాక భూసారం పెగిరి అధిక దిగుబడులు వస్తాయి. రసాయని ఎరువుల వాడడం తగ్గుతుంది. సబ్సిడీ పోను రైతుల 40 కేజీల జనుము విత్తన బస్తా ధర 1448 రూపాయలు, 30 కేజీల జీలుగ బస్తా ధర 1116 రూపాయలుగా ఉంటుంది. మండలంలోని రైతు లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏవో అనురాధ తెలిపారు.

## చేర్యాలలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలు



కార్యక్రమంలో పాల్గొన్న సంఘ సభ్యులు,భక్తులు

**చేర్యాల,మే17, ప్రభాతవార్త**

చేర్యాల మండల కేంద్రంలో జగద్గురువు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు పట్టణ విశ్వబ్రహ్మణ (విశ్వకర్మ) సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని శ్రీ మహమ్మాయిదేవి,శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో దైవమూర్తులకు పంచామృత అభిషేకం,యజ్ఞంతో పాటుపలు కార్యక్రమాలు చేశారు. మద్దూరు తిరుపతయ్యగారు స్వామివారికి పూజా కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.కార్యక్రమంలో విశ్వబ్రహ్మణ సంఘం గౌరవ అధ్యక్షులు ఎం.నారాయణ చారి,అధ్యక్షులు పి.ఆంజనేయులు చారి,ప్రధాన కార్యదర్శి ఎమ్.నర్సింహులుచారి,కోషాధికారి కాసుల చిన్న శ్రీనివాస్ నాయకులు ఎం.మల్లేశం,పి.శ్రీహరి,కే.కృష్ణమూర్తి,ఉప్పల ప్రభాకర్,బి.లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సిఈఐఆర్ టెక్నాలజీతో బాధితుడికి ఫోన్ అప్పగింత



బాధితుడికి ఫోన్‌ను అప్పగిస్తున్న ఎస్సై దామోదర్

**చేర్యాల,మే 17, ప్రభాతవార్త**

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సిఈఐఆర్ టెక్నాలజీతో బాధితుడికి చేర్యాల ఎస్సై దామెదర్ శుక్రవారం అందించారు. చేర్యాల మండలం గుర్జకుంట గ్రామానికి చెందిన వలబోజు నర్సింహాచారి తన సమ్‌సాంగ్ మొబైల్ ఫోన్‌ను తేది:10-10-2023 తారీఖున ఫోన్‌ను పోగొట్టుకోగా,ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన వెబ్‌సైట్లో ఫోన్‌కు సంబందించిన ఐఎంఈఐ నెంబర్‌ను ఎంటర్ చేసి బ్లాక్ చేశారు. దీంతో ఫోన్ దొరికిన వ్యక్తి దానిలో సిమ్ కార్డు వేసుకోవడంతో సంబందిత వెబ్‌సైట్లో అతని వివరాలతో కూడిన సమాచారం చేర్యాల పోలీసులకు చేరింది. అతని నుండి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని, ఫోగొట్టుకున్న బాధితుడకి సమాచారం అందించి చేర్యాల పోలీస్ స్టేషన్‌లో ఎస్సై దామోదర్ సదరు వ్యక్తికి ఫోన్‌ను అందించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ ఎవరైతే ఫోన్ కోల్పోయిన వారు వెంటనే ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటి రిజిస్టర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న ఫోన్‌ను నేరుగా బ్లాక్ చేయవచ్చని తద్వారా కోల్పోయిన ఫోన్ను తిరిగి తొందరగా పొందుతారని తెలిపారు.

### సమాజంలో ప్రజలకు సేవలందించి మంచి పేరు తెచ్చుకోవాలి : డాక్టర్ అరవింద్ కుమార్

**సిద్దిపేట రూరల్, మే 17, ప్రభాతవార్త :**

సమాజంలో ప్రజలకు సేవలందించి దంత వైద్యులుగా మంచి పేరు తెచ్చుకోవాలని సిద్దిపేట పట్టణానికి చెందిన ప్రముఖ తెలంగాణ డెంటల్ అసుపత్రి డాక్టర్ అరవింద్‌కుమార్ అన్నారు. శుక్రవారం సౌత్‌అఫ్రికాలోని స్కూల్ అఫ్ డెంటిస్ట్ కాలేజ్ అఫ్ మెడిసిన్ అండ్ హెల్త్ సైన్స్ యూనివర్శిటీ అఫ్ రువాండాలో బ్యాచిలర్ అఫ్ డెంటల్ సర్జరీకి సంబంధించిన ఫైనల్ పరీక్షలు ఈనెల 13న ప్రారంభమై శుక్రవారంతో ముగిశాయి. ఫైనల్ పరీక్షల నిర్వహణకు సిద్దిపేటకు చెందిన డాక్టర్ఏ.అరవింద్‌కుమార్ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా పాల్గొని పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అరవింద్ కుమార్ మాట్లాడుతూ డెంట్రిస్ట్ పరీక్షల నిర్వహణలో పాటు క్లీనికల్, ల్యాబ్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. గత కొన్ని యేండ్లుగా పలు పాఠశాలలు, కళాశాలల్లో ఉచిత దంత శిబిరాలు నిర్వహించడంతో పాటు పలు సేవా కార్యక్రమాల్లో సేవలు అందించడం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్టం నుంచి పరీక్షల నిర్వహణకు విచ్చేసిన అరవింద్‌కుమార్‌ను రువాండలోని తెలుగు ప్రజలు అయనను అభినందించారు. భారతదేశంలోని తెలంగాణ రాష్టం నుంచి తనకు అవకాశామిచ్చిన హెల్త్ అండ్ సైన్స్ యూనివర్శిటీ రువాండాకు అయన కృత్యజ్ఞతలు తెలిపారు.

## స్థానిక సంస్థలకే ముగ్గురు పిల్లల నిబంధన ఎందుకు?

### -రాష్ట్ర ఎంపిటిసిల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దేవి రవీందర్

**గజ్వేల్, మే 17 (ప్రభాతవార్త):**

మండల పరిషత్, జిల్లా పరిషత్, గ్రామపంచాయతీ ఎన్నికల్లో ముగ్గురు పిల్లలు ఉంటే పోటీ చేయరాదు అనే నిబంధనను వెంటనే తొలగించాలని రాష్ట్ర ఎంపిటిసిల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం గజ్వేల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మండల పరిషత్, జిల్లా పరిషత్, గ్రామపంచాయతీ ఎన్నికల్లో ముగ్గురు పిల్లలు ఉంటే పోటీ చేయరాదనే నిబంధనలు పెట్టడం వల్ల ప్రజా సేవ చేయాలనుకునే వారికి అవకాశం లేకుండా పోతుందన్నారు. పక్క రాష్టమైన ఆంధ్రప్రదేశ్‌లో ఇట్టి నిబంధనలను తొలగించారని, మున్సిపల్ ఎన్నికల్లో గత ప్రభుత్వం ముగ్గురు పిల్లల నిబంధన తొలగించి పోటీ చేసే అవకాశం కల్పించిందన్నారు. రాబోయే పంచాయతీ, మండల పరిషత్ ఎన్నికల్లో ముగ్గురు పిల్లల నిబంధన తొలగించి పూర్తి స్థాయిలో నిధులు, విధులు, అధికారాలు కల్పించి గ్రామ స్వరాజ్య స్థాపనకు కృషి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్‌లు బచ్చలి మహిపాల్, మల్లమారి రవీందర్ ఉన్నారు.

## ఘనంగా ముగిసిన అఖండ సప్తహం ఉత్సవాలు

**సిర్గాపూర్, మే 17, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని శ్రీ హనుమాన ఆలయంలో గత వారం రోజులుగా కొనసాగుత్న అఖండ హరినామ సప్తహ ఉత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిసాయి. ఆలయంలోని మండపంలో ఏర్పాటు చేసిన రుక్మిణ పాండురంగ స్వామి చిత్రపటానికి, గాథ గ్రంథానికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్బంగా కాలా కీర్తన మహోత్సవం, వార్కారి సాంప్రదాయం భజనలు నిర్వహించారారు. సప్తహా కార్యక్రమాలు గ్రామస్థుల సహకారంతో భక్తి శ్రద్దలతో నేత్ర పర్వగా నిర్వహించారు.

## హత్య కేసులో విఠల్‌కు జీవిత ఖైదు

**అల్లాదుర్గం, మే 17, ప్రభాతవార్త:** మండలంలోని చిల్లేర గ్రామానికి చెందిన విఠల్‌కు హత్య కేసులో జీవిత కాల కఠిన కారాగార శిక్షను విధిస్తూ జిల్లా న్యాయ మూర్తి లక్ష్మీ శారద శుక్రవారం తీర్పు వెలువరించినట్లు ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం... చిల్వేర గ్రామానికి చెందిన నాయకుని విఠల్ గత సంవత్సరం మే మాసంలో స్వంత సోదరుడైన జగన్‌ను డబ్బుల విషయంలో గొడవ పెట్టుకుని రాయితో తలపై కొట్టి దారుణంగా హత్య చేసినట్లు పేర్కొన్నారు. అప్పట్లో కేసు నమోదు చేసి కోర్టులో రిమాండ్ చేసినట్లు గుర్తు చేశారు. శుక్రవారం న్యాయమూర్తి కేసు పూర్వాపరాలను పరిశీలించి విఠల్‌కు జీవిత కాలం శిక్షను, 20వేల రూపాలయ జరిమానాను విధిస్తూ తీర్పు వెలువరించినట్లు ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు.

# మంత్రిగారు..రైతాంగ క'న్నీటి' సమస్యను పరిష్కరించండి..

### - అబ్బనికుంట కట్టను తవ్వారు..ఐదేళ్లుగా అలాగే వదిలేశారు..!

### -వెల్పుగొండ గ్రామస్తుల ఆవేదన



ఐదేళ్ల క్రితం కట్టను తవ్వి వదిలేసిన దృశ్యం( ఫైల్ ఫోటో)

**టేక్మాల్,మే 17 ప్రభాతవార్త:**

రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని గత ప్రభుత్వం కోట్లాది రూపాయాలు వెచ్చించి చెరువులు, కుంటల మరమ్మత్తులకు మిషన్ కాకతీయ పథకంతో శ్రీకారం చుట్టింది. అధికారుల నిర్లక్ష్యమో అప్పటి పాలకుల ఆలసత్వమో తెలియదు గాని ఆ పనుల్లోన కొన్ని చెరువులను అర్థంతరంగా నిలిపి వేయడంతో గత ఐదేళ్లుగా ఆ కుంటల్లోనీళ్లు వృధాగా పోతున్న పట్టించుకునే వారు కరువైయ్యారంటూ రైతులు కోనీళ్లు' పెట్టుకుంటున్న వెల్పుగొండ గ్రామస్తుల మనోవేధనకు ప్రభాతవార్త కథన రూపమిది.

టేక్మాల్ మండలంలో మిషన్ కాకతీయ పనులు పూర్తి చేయలేదు. అ సంపూర్తిలో ఒకటైన వెల్పుగొండ గ్రామంలోని అబ్బనికుంట నిర్మాణం చేసిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యమో, అధికారుల అలసత్వమో తెలియదుగాని కొంత పనులు చేసి నాకేం తెలియదని ఐదేళ్ళగా వదిలేశారు. పనులు చేస్తునే కట్ట,తూము మూయడం మరిచారు. దీంతో వచ్చిన వర్షం నీళ్లు కాస్తా నిల్వ ఉండకుండా అలాగే వెళ్లి పోతున్నాయి. దీంతో కుంట కింద ఉన్న ఆయా కట్టదారులు ఎన్నిమార్లు విన్నవించిన అధికారులు గాని కాంట్రాక్టర్లు గాని ఎవరు పట్టించుకోవడం లేదని ఆయా కట్టదారులు ప్రభాతవార్తతో ఆవేదన వ్యకం చేశారు. ఎండ కాలంలో చెరువుల్లో పూడికతీత, పిచ్చిమొక్కల తొలగింపు, చెరువుకట్టల బలోపేతం, తూములు, ఆలుగులను నిర్మించటం వంటి పనులు చేపట్టాల్సి ఉంది. కాగా బాద్యత లేని అధికారులు పల్లేలో సమస్యలు ఉంటే పట్టణాల్లోన మాకాం పెట్టి ఎసీ గదుల్లో కూర్చోని జీతాలు తీసుకుంటు మా సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూరని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్మించిన కట్టడాలు, అ సంపూర్తి పనులపై పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యపు నీడలో నిద్రిస్తున్నారేమో మరీ..!. వేసవి కాలం అ సంపూర్తి పనులు చేయరు. వర్షం కాలం వర్షం పడుతుంది ఏలా చేస్తాం అంటూ కాలం గడుపుతూ వెళుతున్నారు. పనులు లేకుండా జీతా భత్యాలు తీసుకుంటున్న శాఖ ఇదేనేమో అంటు మండిపడుతున్నారు. అసంపూర్తిగా ఉన్న ఆ కుంటల మరమ్మత్తుల కోసం మండల సమావేశాల్లోన సైతం మండల సభ్యులు నిలదీసిన అధికారులు పట్టించుకొక పోవడం వారి నిర్లక్ష్యనికి నిదర్శమని అంటున్నారు.

**ఎవరికి చెప్పిన పట్టించుకోవడం లేదు :వెల్పుగొండ గ్రామస్తులు**

అబ్బని కుంట కింద పంటలు సాగు చేసుకొని జీవనం సాగించేటోళ్లం మెము.. అబ్బనికుంటను మంచిగా జేస్తామని తవ్విండ్రు.. అలాగే వదిలేసింద్రు. అ కుంటలో నీళ్లు ఉండటం లేదు. మా సమస్యకు పరిష్కరం లేదా..మా భాదలు వినే వారులేరు సారూ.. గత ఐదేళ్లుగా అబ్బనికుంట పనులు మోదలు పెట్టి అర్థంతరంగా పనులు చేసి కట్టను తవ్వి నిర్లక్ష్యంగా వదిలేశారు. వచ్చిన నీళ్లు వచ్చినట్లు వెళ్లి పోతున్నాయి. దీంతో పంటలు పండించుకునే వీలు లేదు. కుంటలో నీళ్లు లేవు, సమీపంలోని వ్యవసాయ బొర్లలో భూగర్బజలాలు తగ్గిపోయి పంటలు దెబ్బతింటున్నాయని ఆవేధన వ్యక్తం చేశారు.నీటి ఆధార పంటలపై ఆధారపడి జీవన సాగించే వాళ్లమని ఈ విషయం గత ఐదు ఏళ్లుగా నాయకులకు అధికారులకు చెప్పిన వినిపించుకోవడం లేదన్నారు. ఇకనైనా రాష్ట్ర వైద్య, ఆరోగ్యఅండ్ సైన్స్ టెక్నాలజీ మంత్రి దామోదర్ రాజనర్సింహా ప్రత్యేక చోరవ చూపి మా సమస్యలను పరిష్కరించాలని కొరుతున్నారు. ఇకనైనా ఈసమస్య పరిష్కరానికి నొచుకుంటుందా వేచి చూద్దాం..

# ప్రతి చివరి గింజవరకు ప్రభుత్వం కొనుగోలు

### -కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్



నర్సాపూర్ మార్కెట్ యార్డులోగల ధాన్యం కొనుగోలు కేంద్రంలోని దాన్యాన్ని పరిశీలిస్తు రైతులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ తదితరులు

**నర్సాపూర్ మే, 17. ప్రభాతవార్త :**

ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు అధైర్యపడ వద్దని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి చివరి గింజవరకు కొనుగోలు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ అన్నారు. శుక్రవారం నర్సాపూర్ మండలంలోని పలు దాన్యం కొనుగోలు కేంద్రాలను, నర్సాపూర్ మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి పరిశీలించారు. ఈసందర్బంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ మాట్లాడుతూ ప్రతిపక్షపార్టీలు ధాన్యం కొనుగోలు విషయంలో రాజకీయం చేస్తున్నారన్నారు. కాగా బిఆర్ఎస్ నాయకులు రైతుల కోసం ధర్నాలు, దీక్షలు చేస్తూ రైతులపై మొసలి కన్నీరు కారుస్తు కపటప్రేమ చూపిస్తున్నారన్నారు.10 సంవత్సరాల కెసిఆర్ పాలనలో రైతులకు చేసిందేమిలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమ ప్రభుత్వమని రైతుల బాధ తెలిసిన ముఖ్యమంత్రి రైతుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేశారని తెలిపారు. ఈమేరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ హెచ్చరించారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్‌పిటీసీ శ్రీనివాస్‌గుప్త, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లేషం, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు శివప్రసాద్‌గౌడ్, శివ్వంపేట యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మన్నె శ్రీనివాస్, ఉపాధ్యక్షులు నర్సింహ్మాచారి, సీతారాంపూర్ మన్నె వెంకటేష్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతర ఉత్సవాలకు ముస్తాబవుతున్న రంగంపేటలోని శ్రీ రంగనాయక స్వామి ఆలయం



జాతర ఉత్సవాలకు ముస్తాబవుతున్న శ్రీ రంగనాయక స్వామి ఆలయం

**కొల్చారం, మే17 ప్రభాతవార్త:**

రంగంపేటలో వెలసిన శ్రీ రంగనాయక స్వామి నల్లని చలవరాతితో శేషతల్పంపై స్వామి వారి పాదాల చెంత భూనీల సమేతంగా భక్తులకు తన చల్లని దీవెనలు అందిస్తున్నాడు. ఇక్కడ స్వామి వారి విగ్రహం అనంత పద్మనాభుడిని పోలి ఉండటం ప్రత్యేకర్షణ. అన్నింటికీ మించి ప్రతి రోజు ఆలయ రెండు ప్రధాన ద్వారాలు దాటుకుంటూ స్వామి వారిపై నేరుగా ప్రసరించే సూర్య కిరణాల కాంతిలో మూల విరాట్ దివ్య దర్శనం అపురూపమైన దృశ్యం. ప్రతి ఏటా రంగనాయక స్వామి ఆలయ కమిటీ, భక్త బృందం, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో స్వామి వారి జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తుంటారు. అందులో భాగంగా ఈ యేటా స్వస్తి శ్రీ క్రోధి నామ సంవత్సర వైశాఖ దశమి నుండి పౌర్ణమి వరకు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. శనివారం బండ్లు తిరగటం, సోమవారి వ్యామివారి కళ్యాణం, వైశాఖ శుద్ధ పౌర్ణమి రోజు రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ ఉత్సవ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పరిసర గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జాతర ఉత్సవాలను విజయవంతం చేయగలరని ఆలయ కమిటీ భక్త బృందం సభ్యులు, గ్రామ ప్రజలు తెలిపారు.

## నర్సాపూర్‌లో ఓ మోస్తరు వర్షం..చల్లబడ్డ వాతావరణం

**నర్సాపూర్ మే, 17. ప్రభాతవార్త :** వేసవీ కాలం అయినందున ప్రజలు ఎండవేడిమికి తట్టుకోలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈమేరకు గురువారం శుక్రవారం రెండు రోజులుగా అడపా దడపా ఒక మోస్తారుగా వర్షం కురువడంతో వాతావరణం అంతా ఒక్కసారిగా చల్లబడ్డది.దీంతో ప్రజలు, బాటసారులు తమ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎండ వేడిమికి తట్టుకోలేక ప్రజలు దాభార్తిని తీర్చుకోవడం కోసం పట్టణంలో వెలిసిన చలివేంద్రాలకు, హోటల్స్‌లకు వెళ్ళి తమ దాహార్తిని తీర్చుకుంటున్నారు. ఈమేరకు నర్సాపూర్‌లో హోటల్స్‌లో వాటర్ బాటిళ్లకు భలే గిరాకి తగిలింది.కాగా ఒక మోస్తారు వర్షం కురువడంతో వాతావరణం చల్లబడిపోయినందున ప్రజలు సేద తీర్చుకుంటున్నారు.వేసవీ కాలంలో ఇటువంటి వర్షాలు కురువడంతో ప్రజలుతమ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.అయితే రైతుల పంటలకు మాత్రం కొంత మేర నష్టం కల్గించిందనే చెప్పాలి.పంటల కోతలు పూర్తయ్యి నూర్పిళ్ళుఅయిన తర్వాత రైతులు తమ ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించగా ఈ వర్షం వల్ల వరి ధాన్యం నిల్వ ఉండటంతో తడిసి పోయినందున రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు.అటు కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్ళు సక్రమంగా జరుగక, ఇటు వర్షంతో రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ఈమేరకు వర్షం వల్ల రైతులకు పంటధాన్యంలో కొంత మేర నష్టం కల్గించినా ప్రజలకు మాత్రం ఎండవేడిమి నుంచి ఉపశమనం లబించిందని పలువురు తమ ఈభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

## గణేష్ గడ్డ శ్రీ సిద్ది గణపతి హుండీ లెక్కింపు

**పటాన్‌చెరు,మే17,ప్రభాతవార్త :** పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ పంచాయతీ పరిదిలోని గణేష్ గడ్డ నందు స్వయంభుగా వెలసిన శ్రీ సిద్దిగణపతి ఆలయంలో శుక్రవారం హుండీ లెక్కింపును నిర్వహించారు. శ్రీ సిద్ది గణపతి ఆలయానికి సంబంధించిన 61 రోజుల హుండీ ఆదాయం రూ.14,03,425 అలాగే అన్నదానం హుండీ ఆదాయం రూ.1,01,466 రుపాయల ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో పి మోహన్ రెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపును దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ వి.శివరాజ్ సమక్షంలో కొనసాగింది. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ హుండీలో వచ్చిన ఆదాయాన్ని దేవాలయం అభివృద్ధి కోరకు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలను సమకూర్చునున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది మల్లిఖార్జున్‌రెడ్డి, ఈశ్వర్, అర్చకులు సంతోష్ శర్మ, సతీష్‌శర్మ, అజయ్ శర్మ, జగదీష్ స్వామి, గ్రామ పెద్దలు పాల్గోన్నారు.

## యువత దేశానికి సంపద : జస్టిస్ ఏకె మిశ్రా

**పటాన్‌చెరు,మే17,ప్రభాతవార్త:** యువతే దేశానికి సంపద అని, వారు దేశ సమగ్రత, సానూభూతి, నైతిక నాయకత్వ సూత్రాలకు కట్టుబడి ఉండాలని జాతీయ మానవ హక్కుల కమిషనర్ చైర్‌పర్సన్ జస్టిస్ అరుణ్ కుమార్ మిశ్రా అన్నారు. కౌటిల్యా స్కూల్ పబ్లిక్ పాలసీ తన రెండో పట్టాల ప్రధానోత్సవ వేడుకను శుక్రవారం గీతం హైదరబాద్ ప్రాంగణంలోని కిన్నెరా సెమినార్ హాలులో ఘనంగా జరుపుకుంది. సంప్రదాయ ఆకాడమిక్ ప్రొసేషన్లో ప్రారంభమైన ఈ వేడుక జాతీయ గీతాలాపన, జ్యోతి ప్రజ్వలనతో శ్రీకారం చుట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ అరుణ్ కుమార్ మిశ్రా మాట్లాడుతూ పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీలను అందుకుంటున్న విద్యార్థులను ఆయన అభినందించారు. పబ్లిక్ పాలసీ యొక్క భవిష్యత్తును రూపొందించడంలో వారి పాత్ర, ప్రాముఖ్యతలను నోక్కి చెప్పారు. ధర్మ,ఉమ్మడి ప్రయోజనాలను కొనసాగించాలని, యువత తీసుకునే నిర్ణయాలు, వార సమర్థించే విధానాలు, చర్యలు అసంఖ్యాక వ్యక్తుల జీవితాలపై తీవ్ర ప్రభావాలను కలిగి ఉంటాయని గుర్తుంచుకోవాలన్నారు. అందరికి హక్కులను కల్పించడంలో భారత రాజ్యాంగం యొక్క పాత్ర, వివిధ కార్యక్రమాల ద్వారా విభిన్న వ్యక్తుల భాగాస్వాములను చేయడంలో జాతీయ మానవ హక్కుల కమీషన్ చేస్తున్న ప్రయత్నాలను ఈ సందర్భంగా జస్టిస్ మిశ్రా ఉంటకించారు. అర్దవంతమైన, ఉద్దేశపూర్వక జీవితాన్ని గడపడం ద్వారా తాము పనిచేస్తున్న సంస్థ తమ కుటుంబంతో పాటు మాతృదేశానికి కీర్తి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. గీతం అధ్యక్షుడు ఎం శ్రీ భరత్ తన అధ్యక్షేపన్యాసంలో పట్టభద్రులను అభినందించి, ముఖ్య అతిధిని సత్కరించారు.

## ప్రైవేటు డాక్టర్ల నిర్లక్ష్యం..నిండు ప్రాణం హారీ

**సంగారెడ్డి టౌన్, మే 17, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని సహస్ర ఆసుపత్రికి లివర్ చికిత్స కోసం పట్టణంలోని శివాజీ నగర్‌కు చెందిన రాములు (40)ను ఈ నెల 12న చేర్పించారు. ఆసుపత్రిలో చికిత్స అందుకున్న రాములును ఆసుపత్రి వర్గాలు 4 రోజుల క్రితం డిశ్చార్జ్ చేశారు. శుక్రవారం తెల్లవారు జామున రాములుకు మరో మారు ఆరోగ్యం క్షీణించడంతో రాములు బందువులు రాములను ఆసుపత్రికి తరలించారు. వైద్యులు రాములుకు చికిత్స అందిస్తుండగా రాములు కానరానిలోకాలకు చేరిపోయాడు. వైద్యుల నిర్లక్ష్యంతోనే రాములు మృతి చెందినట్లు రాములు బంధువులు ఆరోపిస్తూ ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. రాములు చనిపోయాడని చెబితే ఆసుపత్రి వర్గాలు తమకేం పట్టనట్లుగా వ్యవహరంచారని మండిపడ్డారు. మృతుడు రాములు కుటుంబ సభ్యులకు ఆసుపత్రి డాక్టర్ రాజు 2లక్షల 75వేల రూపాయలు ఇచ్చి ఆందోళన చేయకుండా సర్దుబాటు చేసుకున్నట్లు తెలుస్తోంది.

## పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

-ఆసుపత్రిలో చిక్సిత పొందుతూ మృతి

-శవయాత్ర నిర్వహిస్తున్న క్రమంలో అడ్డుకున్న పోలీసులు

-శవాన్ని పోస్టుమార్టంకు తరలింపు

-తిరిగి అప్పగించడంతో దహన సంస్కారం చేసిన కుటుంబికులు

**చిన్నకోడూరు, మే 17, ప్రభాతవార్త :** పురుగుల మందు తాగి అత్మహత్య చేసుకున్న యువకుడు అసుపత్రిలో చిక్సిత పొందుతూ మృతి చెందగా దహన సంస్కారం చేయడానికి శవయాత్ర నిర్వహిస్తున్న క్రమంలో పోలీసులు అడ్డుకొని శవాన్ని పోస్టుమార్టంకు తీసుకెళ్లిన సంఘటన సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల పరిధిలోని చంద్లాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన పి.శేఖర్ అనే యువకుడు అవేశంతో తండ్రిపై చేయి చేసుకున్నానని..మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి అత్మహత్యకు పాల్పడగా చికిత్స పొందుతూ గురువారం అర్థరాత్రి మృతి చెందినట్లు తెలిపారు. ఈనెల 11న మధ్యాహ్నం సోదరి శేఖర్‌కు ఫోన్ చేసి అమ్మ, నాన ఇద్దరు గొడవ పడుతున్నారని తెలిపినట్లు తెలిపారు. అవేశంతో ఇంటికి వచ్చిన శేఖర్ తండ్రి మల్లయ్యపై చేయి చేసుకొని కొట్టినట్లు తెలిపారు. అనంతరం తండ్రిది తప్పేమి లేదని తెలుసుకున్న శేఖర్ అకారణంగా తండ్రిని కొట్టానని తీవ్ర మనస్థాపానికి గురై గ్రామ శివారులో పురుగుల మందు తాగి అత్మహత్యకు పాల్పడగా ఇది గమనించిన కుటుంబీకులు, స్థానికులు సిద్దిపేటలోని ప్రైవేటు అసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో శేఖర్ చిక్సిత పొందుతూ మరణిచడంతో కుటుంబీకులు దహన సంస్కారాలు నిర్వహించ డానికి సశ్మన వాటికకు తీసుకెళ్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు శవానికి పోస్టుమార్టం నిర్వహించిన తర్వాత దహన సంస్కారాలు చేయాలని తెలపడంతో కుటుంబీకులు, గ్రామస్తులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఎట్టి పరిస్థితుల్లో పోస్టుమార్టం చేయకుండా దహన సంస్కారాలు చేయొద్దని పోలీసులు గట్టిగా వాదించడంతో కుటుంబీకులు, గ్రామస్తులు శాంతించారు. దీంతో శేఖర్ శవానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం తిరిగి అప్పగించడంతో కుటుంబీకులు, గ్రామస్తులు దహన సంస్కారాలు నిర్వహించారు. బాధితుల ఫిర్యాదు మేరకు చిన్నకోడూరు పోలీసులు కేసునమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

**ములుగు, మే 17 (ప్రభాతవార్త):**

గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన ములుగు మండలం వంటిమామిడి రాజీవ్‌రహదారిపై గురువారం రాత్రి 11 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. ములుగు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వంటిమామిడి కూరగాయల మార్కెట్ ఎదురుగా రాజీవ్‌రహదారిపై సుమారు 35 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించి మార్చురీ గదిలో భద్రపర్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

## గుండెపోటుతో హరిభక్త పారాయణులు లక్ష్మణ్‌రావు మృతి

**నారాయణఖేడ్ టౌన్, మే 17, ప్రభాతవార్త:** నియోజకవర్గకేంద్రమైన నారాయణఖేడ్‌లో నివాసం ఉంటున్న మనూర్ మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన హరిభక్త పారాయణులు లక్ష్మణ్‌రావు (75) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో అవస్థలు పడుతూ ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స అందుకుంటూ శుక్రవారం గుండెపోటు రావడంతో కానరాని లోకాలకు చేరిపోయినట్లు కుటుంబీకులు తెలిపారు.లక్ష్మణ్‌రావు గత కొంత కాలంగా అఖండ హరనామ సప్తహ్ కార్యక్రమాలతో పాటు మరాఠా సాంప్రదాయ వార్కారి భజన, కీర్తన, ప్రచనాలు చేస్తూ భక్తులను ఆధ్యాత్మికతపై వివరించేవారు. లక్ష్మణ్‌రావు మృతి పట్ల భక్తులు సంతాపం తెలిపారు. సాయంత్రం పట్టణంలో లక్ష్మణ్‌రావుకు కన్నీటి వీడ్కోలు పలికారు.

## మహిళలు అన్ని రంగాల్లో ముందుంటున్నారు

### -సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ప్రసన్నరాణి



సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, మే 17, ప్రభాతవార్త :**

మహిళలు అన్ని రంగాల్లో ముందుండి సమాజాభివృద్ధిలో ముఖ్య భూమికను పోషిస్తున్నారని సిద్దిపేట మున్సిపల్ కమీషనర్ ప్రసన్నరాణి అన్నారు. యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ సిద్దిపేట అధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించిన బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, మగ్గం వర్క్స్ శిక్షణ ముగింపు సందర్భంగా శుక్రవారం యూనియన్ బ్యాంక్ అఫ్ ఇండియా గ్రామీణ ఉపాధి శిక్షణ సంస్థ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అమె పాల్గొని మాట్లాడారు. యూనియన్ బ్యాంకు గ్రామీణ శిక్షణ సంస్థ అధ్వర్యంలో జిల్లాలో డిమాండ్ ఉన్న కోర్సులను ఎంపిక చేసి గ్రామీణ ప్రాంతాల యువతకు నైపుణ్య శిక్షణలు ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారు బ్యాంకుల నుంచి రుణం తీసుకొని యూనిట్ స్థాపించాలన్నారు. మెదక్, సిద్దిపేట డిడిఎం నాబర్డు కృష్ణతేజ, నిఖిల్‌రెడ్డి, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యజిత్ తదితరులు మాట్లాడారు. శిక్షణ పూర్తి చేసుకున్న 50 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది మొహమ్మద్ నజీమ్, నాగరాజు, శ్రీనివాస్, స్వప్న, ప్రశాంత్, అరవింద్, కనకవ్వ తదితరులు పాల్గొన్నారు.

## మామిడ్యాలలో బొడ్రాయి, పోతలింగన్న విగ్రహాల ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న మామిడ్యాల గ్రామస్తులు

**ములుగు, మే 17 (ప్రభాతవార్త):**

గ్రామ అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా వచ్చి సహకరించాలని వంటిమామిడి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కోడూరు భూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ములుగు మండల పరిధిలోని మామిడ్యాల గ్రామంలో బొడ్రాయి, పోతలింగన్న విగ్రహాల ఏర్పాటుకు గ్రామ పూజారి సనాతనశర్మ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ కొండపోచమ్మ సాగర్‌లో ఊరుతో సహా సర్వం కోల్పోయిన మా గ్రామస్తులకు తునికిబొల్లారం గ్రామ సమీపంలో గత ప్రభుత్వం నూతన గ్రామాన్ని నిర్మించి ఇండ్లను కేటాయించింది. ఆ గ్రామంలో బొడ్రాయి, పోతలింగన్న విగ్రహాల ఏర్పాటు కోసం గ్రామంలోని పెద్దలతో కలిసి స్థలాన్ని ఎంపికచేసి భూమిపూజ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్తయ్యచారి, సాయిరెడ్డి, రాంరెడ్డి, దర్శన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వీరేశం గౌడ్, ఆరె సత్తయ్య, పసుల సత్తయ్య, ఆరె నర్సింలు, ఆరె జనార్థన్, భవానందం, గాజుల పెంటయ్య, కుమ్మరి యాదగిరి, రవి, నాగోజి అనిల్‌చారి పాల్గొన్నారు.

## జహీరాబాద్ ఎంపిగా బీబీ పాటిల్ గెలుపు ఖాయం

### -మండల బిజెపి అధ్యక్షుడు కోణం విఠల్

**పెద్దశంకరంపేట, మే17 ప్రభాతవార్త:**

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ గెలుపు ఖాయమని మండల బీజేపీ అధ్యక్షులు కోణం విఠల్ పేర్కొన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేటలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో ప్రధానమంత్రి మోడీ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఆయన అన్నారు. దేశ వ్యాప్తంగా బీజేపీకి మంచి ఆదరణ లభిస్తుందని, 400 పైగా పార్లమెంట్ స్థానాలు గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. బీబీ పాటిల్ కోసం ఎన్నికల్లో కష్టపడ్డ బీజేపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ దామోదర్, నాయకులు సూర్యప్రకాష్, అశోక్, శ్రావణ్ కుమార్, మంగళ కృష్ణ, ఎర్ర శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ ఎంపిగా రఘునందన్‌రావు గెలుపు ఖాయం

### -బిజెపి జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్



విలేకరులతో మాట్లాడుతన్న బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్

**మెదక్ మున్సిపాలిటీ, మే17 ప్రభాతవార్త:**

మెదక్ ఎంపీగా బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు గెలుపు ఖాయమని బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మెదక్ పట్టణంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ గత మూడు నెలలుగా మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అవిశ్రాంతంగా కష్టపడటం వల్ల మెదక్ ఎంపీగా రఘునందన్‌రావు గెలువబోతున్నారని అన్నారు. మెదక్ పార్లమెంట్‌లోని ఏడు నియోజకవర్గాల్లో భారీ మెజారిటీ రానుందని స్పష్టంగా అర్థమైందన్నారు. గత మూడు నెలల నుంచి కష్టపడిన బీజేపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎంఎల్ఎన్ రెడ్డి, శ్రీనివాస్, కిసాన్ మోర్చా అధ్యక్షులు సత్యనారాయణ, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు కాశీనాథ్, సీనియర్ నాయకులు వెల్మల సిద్ది రాములు, జిల్లా ఉపాధ్యక్షులు టి. శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షులు ప్రసాద్, ప్రభాకర్, రాములు, రాజు, భాను, రంజిత్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు హార్టికల్చర్ యూనివర్సిటీలో సమావేశం

**ములుగు, మే 17 (ప్రభాతవార్త):** ములుగు మండలకేంద్రంలో గల శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యానవన విశ్వవిద్యాలయంలో ప్రాంతీయ పరిశోధన మరియు విస్తరణ సలహా మండలి సమావేశం శనివారం నిర్వహించడం జరుగుతుందని విశ్వవిద్యాలయ రిజిస్టర్ డాక్టర్ భగవాన్ తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఉద్యానవన సంచాలకులు కె.అశోక్‌రెడ్డి హాజరవుతున్న ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి ఉద్యానవన శాఖ సంయుక్త సంచాలకులు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు, విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

**గజ్వేల్, మే 17 (ప్రభాతవార్త):**



పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం

గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామానికి చెందిన తోట ప్రవీణ్ తన ఆటోలో 15 క్వింటాళ్ళ రేషన్ బియ్యంను తరలిస్తుండగా అహ్మదీపూర్ గ్రామ శివారులో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేసి వాటిని పట్టుకొని గజ్వేల్ పోలీసులకు అప్పగించారు. ఈ సందర్బంగా టాస్క్‌ఫోర్స్ పోలీసు అధికారులు మాట్లాడుతూ సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పిడిఎస్ రైస్ అక్రమ రవాణా చేసినా, నిల్వ ఉంచినా చట్ట ప్రకారం కేసులు నమోదుచేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూదం, గ్యాంబ్లింగ్, చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పట్టణాల్లో, గ్రామాల్లో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే తమకు సమాచారం అందించాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.